



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 1 సంచిక : 263 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : ఒంగోలు | గురువారం 28 మే 2026 | వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE :263 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : ONGOLE | THU 28 MAY 2026 | PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur




## చంద్రబాబును ఎదుర్కోవాలి.. ప్రతిచోటా వైసీపీ జెండా ఎగరాలి
## స్థానిక ఎన్నికలపై జగన్ ఫోకస్

- స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు జగన్ పిలుపు
- ఏకగ్రీవ ఎన్నిక జరిగితే నియోజకవర్గ ఇంఛార్జి వైఫల్యంగా పరిగణిస్తానని హెచ్చరిక
- ప్రభుత్వ వైఫల్యాలపై 'వెన్నుపోటు రెండేళ్లు' బుక్‌లెట్‌ను ఇంటింటా పంచాలని ఆదేశం
- ఎస్సీలు బలంగా ఉన్నచోట వారినే అభ్యర్థులుగా నిలపాలని సూచన
- ప్రతిచోటా పోటీ చేసి వైసీపీ జెండా ఎగరేయాలని నేతలకు దిశానిర్దేశం

- మిగతా 2లో



## ఆఫ్‌లైన్ అయినా, హైబ్రిడ్ మోడల్ అయినా టీమ్ 11 కి బ్యాటింగ్ తప్పదు
### మహానాడులో నారా లోకేశ్

- హైబ్రిడ్ మోడల్ లో మహానాడు అనగానే టీమ్ 11 సంబరాలు చేసుకున్నారంట అంటూ ఎద్దేవా
- దేశానికి సంక్షేమాన్ని పరిచయం చేసింది ఎన్టీఆర్ అని కితాబు
- రాజకీయాల్లో ఎన్టీఆర్ ట్రెండ్ సెట్ చేశారని వ్యాఖ్య

పెన్ పవర్ డెస్క్:మహానాడు ప్రారంభం సందర్భంగా టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ లోకేష్ ప్రత్యర్థి పార్టీపై విమర్శనాస్త్రాలు సంధించారు. హైబ్రిడ్ విధానంలో మహానాడు జరుగుతున్నప్పటికీ టీమ్ -11 కి బ్యాటింగ్ తప్పదని వార్నింగ్ ఇచ్చారు. "ఆఫ్‌లైన్ అయినా, ఆన్‌లైన్ అయినా, హైబ్రిడ్ అయినా మహానాడు మాస్ జాతర సూపర్ హిట్. పసుపు పండుగ మహానాడు. ప్రతి కార్యకర్త కాలర్ ఎగరేసి నేను తెలుగు వాడిని, నాది తెలుగుదేశం పార్టీ అని చెప్పుకునే వేదిక మహానాడు. నేషన్ ఫస్ట్ అనేది తెలుగుదేశం పార్టీ విధానం. మన దేశం – మన బాధ్యత. ప్రధాని మోదీ సూచించిన మార్గాన్ని మనం ఫాలో అవుతున్నాం. నెల్లూరులో భారీగా మహానాడు నిర్వహించాలనుకున్నాం.

- మిగతా 2లో




## ఎబోలా ముప్పు: భారత్‌లో లేదు..
## కానీ నిఘా తీవ్రం!

- బెంగళూరు అనుమానిత వ్యక్తికి నెగెటివ్
- విమానాశ్రయాల వద్ద ముమ్మరంగా స్క్రీనింగ్
- ఆఫ్రికాలో వేగంగా పెరుగుతున్న బుండిబుగ్యో కేసులు
- కాంగోలో వందలాది అనుమానిత మరణాలు
- నిఘా పెంచినట్లు తెలిపిన కేంద్ర ఆరోగ్యశాఖ

పెన్ పవర్ డెస్క్:ఆఫ్రికా దేశాల్లో వేగంగా విస్తరి స్తున్న ఎబోలా వైరస్ మహమ్మా రిపై కేంద్ర ప్రభుత్వం అప్రమ త్తమైంది. దేశంలో అధికారికంగా

- మిగతా 2లో



## ఆడబిడ్డల వల్లే విజయం.. ఇది మహిళా మహానాడు

- ఇటీవలి విజయాన్ని దృష్టిలో ఉంచుకుని మహానాడును మహిళలకు అంకితం చేస్తున్నామన్న చంద్రబాబు
- 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానంతో పరిశ్రమలకు వేగంగా అనుమతులు ఇస్తున్నామని వెల్లడి
- ఏఐ, ఏరోస్పేస్ వంటి రంగాలతో ఏపీని గ్లోబల్ టెక్ హబ్‌గా మారుస్తామని హామీ
- మెగా డీఎస్సీ, పోలీస్ నియామకాలతో యువతకు ఉద్యోగ భరోసా కల్పించామన్న సీఎం
- వచ్చే ఎన్నికల కోసం కాదు, భావితరాల కోసమే తమ ప్రభుత్వం పనిచేస్తుందని స్పష్టీకరణ


- మిగతా 2లో



## డేటా సెంటర్ల హబ్‌గా భారత్.. ఆసియా-పసిఫిక్‌లో రెండో స్థానం.. హైదరాబాద్ అరుదైన ఘనత

- ఆసియా-పసిఫిక్‌లో రెండో అతిపెద్ద డేటా సెంటర్ మార్కెట్‌గా భారత్
- ప్రస్తుతం 1.6 గిగావాట్ల సామర్థ్యం.. నిర్మాణంలో మరో 3.1 గిగావాట్లు
- ముంబైతో పాటు హైదరాబాద్, చెన్నై, ఢిల్లీ వంటి నగరాలు వృద్ధిలో కీలకం
- ఆసియా-పసిఫిక్‌లో హైదరాబాద్‌ను టాప్ సెకండరీ మార్కెట్‌గా గుర్తించిన నివేదిక

- మిగతా 2లో



## ప్రధాని మోదీతో 20 నిమిషాలు సీఎం విజయ్ భేటీ.. పలు విజ్ఞప్తులు



- నెదర్లాండ్స్ నుంచి రాగి ఫలకాలను తీసుకువచ్చినందుకు మోదీకి విజయ్ థ్యాంక్స్
- కర్ణాటకకు మేకెదాటు ప్రాజెక్టుకు అనుమతి ఇవ్వకూడదని విజ్ఞప్తి
- ప్రభుత్వ కార్యక్రమాల ప్రారంభంలో రాష్ట్ర గీతాన్ని ప్లే చేయడానికి అనుమతించాలన్న సీఎం

- మిగతా 2లో



## ఎండ తీవ్రత నేపథ్యంలో ప్రజలకు ప్రధాని మోదీ కీలక సూచనలు

- నిత్యం తగినంత నీరు తాగాలన్న ప్రధాని నరేంద్రమోదీ
- వీలైనంత వరకు మధ్యాహ్నం సమయంలో బయటకు వెళ్లవద్దని సూచన
- వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయవద్దని సూచన

పెన్ పవర్ డెస్క్:దేశంలోని చాలా ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రజలకు కీలక సూచనలు చేశారు. తీవ్రమైన వేడి పరిస్థితుల్లో పలు జాగ్రత్తలు సూచించారు.

- మిగతా 2లో

## ఓటరు జాబితాలో పేరు లేకపోతే పౌరసత్వం పోయినట్లు కాదు

- ఈసీ పరిధి కేవలం ఎన్నికల వరకే
- తొలగించిన పేర్లను కేంద్రానికి పంపాలని ఆదేశం
- హోం శాఖ ఆధ్వర్యంలో పౌరసత్వ విచారణ
- పౌరులని తేలితే ఓటు హక్కు పునరుద్ధరణ



పెన్ పవర్ డెస్క్:ఎన్నికల సంఘం చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను సమర్థించిన సుప్రీంకోర్టు పౌరసత్వంపై కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ ప్రక్రియపై దాఖలైన పిటిషన్లపై బుధవారం విచారణ జరిపిన న్యాయస్థానం ఓటరు జాబితా నుంచి వ్యక్తి పేరు తొలగించినంత మాత్రాన పౌరసత్వం రద్దయినట్లు కాదని స్పష్టం చేసింది. ఎన్నికలకే పరిమితంచీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చీలతో

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

## ఎండ తీవ్రత నేపథ్యంలో ప్రజలకు ప్రధాని మోదీ కీలక సూచనలు

- మొదటి పేజి తరువాయి

నిత్యం తగినంత నీరు తాగాలని అన్నారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదిక ద్వారా ఆయన ప్రజలకు జాగ్రత్తలు చెప్పారు. వీలైనంత వరకు మధ్యాహ్నం సమయంలో బయటకు వెళ్లవద్దని సూచించారు.అతి తీవ్రమైన వేడి నుంచి ప్రజలు తమను తాము కాపాడుకోవాలని అన్నారు. వృద్ధులను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని తెలిపారు. సాధ్యమైనంత వరకు ఇతరులకు సహాయం చేయాలని, ఇళు ,, దుకాణాల వద్ద ఆరుబయట పక్షులు, జంతువుల కోసం నీటిని ఉంచాలని కోరారు. ఎండ కారణంగా ఎవరికైనా ఏమైనా అయితే ఏం జాగ్రత్తలు తీసుకోవాలో సూచనలు చేశారు.తల తిరగడం, వికారం, అలసట వంటి వడదెబ్బ లక్షణాలను నిర్లక్ష్యం చేయవద్దని కోరారు. చుట్టూ ఉన్నవారిలో ఎవరైనా అకస్మాత్తుగా స్పృహ కోల్పోయినట్లు అనిపించినా, నీరసించినా వెంటనే వారిని నీడ ఉన్న ప్రదేశానికి తీసుకువెళ్లాలని అన్నారు. ఇలాంటి సమయాల్లో అప్రమత్తంగా వ్యవహరించడం వల్ల ఒక ప్రాణాన్ని కాపాడుతామని పేర్కొన్నారు. అధిక ఉష్ణోగ్రతల ప్రభావం పిల్లలు, వృద్ధులు, రైతులు, కార్మికులపై ఎక్కువగా ఉంటోందని అన్నారు.

రాబోయే రోజుల్లో ఢిల్లీ-ఎన్సీఆర్ ప్రాంతంలో తీవ్రమైన వడగాల్పులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. విదర్భ, ఛత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్, హర్యానా, రాజస్థాన్, బీహార్, ఒడిశా, తెలంగాణ, కోస్తా, ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో తీవ్ర వడగాల్పులు వీస్తున్నాయి. మే 29 నుంచి ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే కురిసే అవకాశం ఉందని తెలిపింది.

### డేటా సెంటర్ల హబ్‌గా భారత్.. ఆసియా-పసిఫిక్‌లో

## రెండో స్థానం.. హైదరాబాద్ అరుదైన ఘనత

భారత డేటా సెంటర్ల మార్కెట్ అత్యంత వేగంగా విస్తరిస్తూ గ్లోబల్ డిజిటల్ మౌలిక సదుపాయాల రంగంలో కీలక స్థానానికి చేరుకుంటోంది. ఆసియా-పసిఫిక్ (ఏపీఏసీ) ప్రాంతంలోనే రెండో అతిపెద్ద డేటా సెంటర్ మార్కెట్‌గా భారత్ నిలిచింది. ప్రస్తుతం దేశంలో 1.6 గిగావాట్ల కార్యాచరణ సామర్థ్యం ఉండగా.. మరో 3.1 గిగావాట్ల సామర్థ్యం నిర్మాణం, ప్రణాళిక దశల్లో ఉంది. ప్రముఖ ప్రాపర్టీ కన్సల్టెన్సీ సంస్థ కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ నేడు విడుదల చేసిన తాజా నివేదిక ఈ ఆసక్తికర విషయాలను వెల్లడించింది.దేశంలో కృత్రిమ మేధ (ఏఐ) వినియోగం పెరగడం, హైపర్‌స్కేల్ క్లౌడ్ విస్తరణ, సంస్థల నుంచి డిమాండ్ అధికమవ్వడం వంటి కారణాలతో భారత్ డిజిటల్ మౌలిక సదుపాయాలకు కీలక కేంద్రంగా మారుతోందని నివేదిక పేర్కొంది. ఈ వృద్ధికి ముంబై, హైదరాబాద్, చెన్నై, ఢిల్లీ-ఎన్‌సీఆర్, పుణె, బెంగళూరు వంటి నగరాలు వెన్నుదన్నుగా నిలుస్తున్నాయి.ఈ మార్పుపై కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమ్ సరాఫ్ మాట్లాడుతూ.. "ప్రస్తుతం ప్రపంచ డేటా సెంటర్ రంగం వృద్ధిలో కొత్త దశకు చేరుకుంది. ఇక్కడ డిమాండ్‌తో పాటు విద్యుత్ లభ్యత, మౌలిక సదుపాయాల సంసిద్ధత, నిర్మాణ సామర్థ్యం అత్యంత కీలకంగా మారాయి" అని వివరించారు. ఈ మార్పులకు అనుగుణంగా భారత్ పటిష్ఠమైన స్థితిలో ఉందని, బలమైన డిమాండ్, విస్తరిస్తున్న డెవలప్‌మెంట్ పైప్‌లైన్, బహుళ నగరాల పర్యావరణ వ్యవస్థ దీనికి దోహదపడుతున్నాయని ఆయన తెలిపారు.

గ్లోబల్ డేటా సెంటర్ మార్కెట్‌లో హైదరాబాద్‌కు 9వ ర్యాంక్

భారత డేటా సెంటర్ల మార్కెట్‌కు ముంబై నగరం కేంద్రంగా నిలుస్తోంది. 2026 చివరి నాటికి ఈ నగరం 1 గిగావాట్ కార్యాచరణ సామర్థ్యాన్ని అధిగమిస్తుందని అంచనా. ఇక హైదరాబాద్, చెన్నై, ఢిల్లీ ఎన్‌సీఆర్, పుణె వంటి ద్వితీయ శ్రేణి మార్కెట్లు కూడా ఈ వృద్ధికి గణనీయంగా దోహదపడుతున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్ ఆసియా-పసిఫిక్ ప్రాంతంలోనే టాప్ సెకండరీ మార్కెట్‌గా, ప్రపంచవ్యాప్తంగా తొమ్మిదో స్థానంలో నిలిచిందని నివేదిక ప్రత్యేకంగా ప్రస్తావించింది. ఇది డేటా సెంటర్ల ల్యాండ్‌స్కేప్‌లో హైదరాబాద్ ప్రాముఖ్యతను స్పష్టం చేస్తోంది. మరోవైపు బెంగళూరును తృతీయ శ్రేణి మార్కెట్‌గా నివేదిక వర్గీకరించింది.

భారతదేశ దీర్ఘకాలిక విస్తరణ ప్రణాళికలు కూడా ఎంతో ఆశాజనకంగా ఉన్నాయి. భవిష్యత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఆపరేటర్లు పెద్ద ఎత్తున భూములను సేకరిస్తున్నారు. ప్రస్తుతం 10.5 గిగావాట్లకు పైగా సామర్థ్యం ఇంకా భూమి దశలోనే ఉందని, ఇది రాబోయే రోజుల్లో భారీ అభివృద్ధికి సంకేతమని నివేదిక పేర్కొంది.

## చంద్రబాబును ఎదుర్కోవాలి.. ప్రతిచోటా వైసీపీ జెండా ఎగరాలి

ఏపీలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలపై వైసీపీ అధినేత జగన్ పూర్తిస్థాయిలో దృష్టి సారించారు. ఎన్నికలకు పార్టీ యంత్రాంగాన్ని సమాయత్తం చేసే క్రమంలో నియోజకవర్గ ఇంఛార్జిలకు ఆయన తీవ్ర హెచ్చరిక జారీ చేశారు. ఏ నియోజకవర్గంలోనైనా, ఏ ఒక్క స్థానంలోనైనా ఎన్నిక ఏకగ్రీవమైతే, దానిని పూర్తిగా ఆ ఇంఛార్జి వైఫల్యంగానే పరిగణిస్తానని తేల్చిచెప్పారు. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ ముఖ్య నేతలు, సమన్వయకర్తలు, ఇంఛార్జిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో జగన్ కీలక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అధికార పార్టీ కుట్రలను ఎదుర్కొని ప్రతిచోటా వైసీపీ జెండా ఎగరేయాలని పిలుపునిచ్చారు. "ఎన్ని కుట్రలు చేసినా, ఎన్ని ఇబ్బందులు పెట్టినా కూడా స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతిచోటా వైసీపీ జెండా ఎగరేయాలి. ఎక్కడైనా ఏకగ్రీవం జరిగిందంటే మాత్రం నేను చాలా సీరియస్‌గా తీసుకుంటా. ఇది మళ్లీ మళ్లీ చెబుతున్నా. అలా జరిగితే అది నియోజకవర్గ ఇంఛార్జి ఫెయిల్యూర్‌గానే భావిస్తా" అని జగన్ స్పష్టం చేశారు.అభ్యర్థుల ఎంపిక, వారికి ఇవ్వాల్సిన భరోసాపై కూడా జగన్ దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా ఎస్సీలు బలంగా ఉన్న గ్రామాల్లో వారి నుంచే అభ్యర్థులను ఎంపిక చేయాలని సూచించారు. పోటీ చేసే అభ్యర్థులకు పార్టీ, ఇంఛార్జి అండగా ఉన్నారనే ధైర్యాన్ని కల్పించాలని, అలా చేస్తేనే అసెంబ్లీ ఎన్నికల్లో వారు మనకు అండగా నిలుస్తారని వివరించారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే వారిని గుర్తించి, ఎన్నికల బరిలోకి దింపాలని ఆదేశించారు.

చంద్రబాబు ప్రభుత్వ పాలనా వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని జగన్ నేతలకు సూచించారు. ఇందుకోసం 'వెన్నుపోటు రెండేళ్లు' పేరుతో రూపొందించిన బుక్‌లెట్‌ను ప్రతి ఇంటికీ చేరవేయాలని ఆదేశించారు. ప్రభుత్వ లోపాలపై ఇంటింటా చర్చ జరిగేలా చేయడం ద్వారా ప్రజలే ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరగబడతారని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ ప్రచార కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించాలని నేతలకు స్పష్టం చేశారు.

# బాదంపప్పు బాగోతాలు- 5

- అనుమానాల నీడ..?
- టౌన్ స్టేషన్‌లో నిఘా భయం?
- సొంత శాఖలోనే ఉద్యోగులపై బాదంపప్పు అనుమానాల నీడ..?
- తాడేపల్లిగూడెం టౌన్ పోలీస్ స్టేషన్‌లో అసాధారణ నిశ్శబ్దం వెనుక కారణాలేమిటి..?
- సమాచార లీకులపై బాదం పప్పు కు అంతర్గత ఆందోళన పెరిగిందా..?
- మీడియా ప్రతినిధుల ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నారా..? అలా
- చేస్తే లీగల్ గా ఏం జరుగుతుందో తెలుసా..?
- అధికార వ్యవస్థలో విశ్వాస సంక్షోభం నెలకొంటోందా..?
- ప్రజల్లో వినిపిస్తున్న ప్రశ్నలకు సమాధానం ఎవరు చెబుతారు..?




**ఎడిటర్, పెన్ పవర్ భీమవరం/ తాడేపల్లిగూడెం, మే 27:** ఒకప్పుడు క్రమశిక్షణ, పరస్పర నమ్మకానికి ప్రతీకగా నిలిచిన పోలీస్ శాఖలో ఇప్పుడు అనుమానాల మేఘాలు కమ్ముకుంటున్నాయా..? తాడేపల్లిగూడెం టౌన్ పోలీస్ స్టేషన్ చుట్టూ ఇటీవల వినిపిస్తున్న చర్చలు ఇదే ప్రశ్నను ముందుకు తెస్తున్నాయి.

స్టేషన్‌లో జరుగుతున్న అంతర్గత వ్యవహారాలు, కొంత సమాచారం బయటకు వస్తుండటంతో "ఎక్కడో లీకేజీ జరుగుతోంది" అనే అనుమానం కొందరు అధికారుల్లో పెరిగిందనే ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో సొంత సిబ్బందిపైనే నిఘా పెరిగిందని, కొందరిపై ప్రత్యేక దృష్టి పెట్టారనే చర్చలు ఉద్యోగ వర్గాల్లో వినిపిస్తున్నాయి.

అయితే ఈ ప్రచారాల వెనుక వాస్తవం ఏమిటి..? నిజంగానే సమాచార లీకులపై ఆందోళన ఉందా..? లేక ఇది అంతర్గత విభేదాల ప్రతిఫలమా..? అనే ప్రశ్నలకు సమాధానాలు మాత్రం ఇంకా బయటకు రావాల్సి ఉంది.

ఇదే సమయంలో మీడియా ప్రతినిధుల ఫోన్ కాల్స్‌పై నిఘా ఉందనే వార్తలు కూడా చర్చనీయాంశంగా మారాయి.

విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం...

ఇదే సమయంలో పెన్ పవర్ ప్రతినిధులు, ముఖ్యంగా ఈ కథనాలపై పనిచేస్తున్న జర్నలిస్టులు జాగ్రత్తగా ఉండాలని న్యాయ నిపుణులు సూచించారు.. వ్యక్తిగత గోప్యత, కమ్యూనికేషన్ భద్రత పై చట్టబద్ధ అనుమతులు లేకుండా ఎవరైనా ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడితే అది తీవ్రమైన న్యాయపరమైన సమస్యలకు దారి తీసే అవకాశం ఉందని న్యాయ నిపుణులు చెబుతున్నారు.

అధికార వ్యవస్థలో పరస్పర విశ్వాసం దెబ్బతింటే దాని ప్రభావం పరిపాలనపై పడే ప్రమాదం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ప్రజల్లో వినిపిస్తున్న ప్రశ్నలకు సంబంధిత అధికారులు స్పష్టత ఇస్తారా..? లేక ఈ అనుమానాలు మరింత పెరుగుతాయా..? అనేది వేచి చూడాల్సి ఉంది.

**ఎపిసోడ్ -15**

**ఎమ్మార్వో రాసలీలలు**

**బుజ్జి కోసం పెంటపాడు నుండి తాడేపల్లి గూడెం వస్తున్నాడా..?**

**మాన్యువల్ ఎఫ్.ఏం.సీ సంగతి ఏంటి చిలక్కొట్టుడు సునీల్..?**

**శాఖపరమైన చర్యలు ఉంటాయా..?**

**చదువుతూనే ఉండండి పెన్ పవర్... ప్రశ్నించడం మన హక్కు.**

## ఆడబిడ్డల వల్లే విజయం.. ఇది మహిళా మహానాడు

**పెన్ పవర్ డెస్క్:**ఇటీవలి ఎన్నికల విజయంలో మహిళలు కీలక పాత్ర పోషించారని, అందుకే ఈ మహానాడును వారికి అంకితం చేస్తూ 'మహిళా మహానాడు'గా ప్రకటిస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. వర్చువల్ విధానంలో జరిగిన మహానాడు సభలో ఆయన మాట్లాడుతూ, మహిళలు, యువత భవిష్యత్తే తమ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని స్పష్టం చేశారు.మహిళల ఆర్థిక స్వావలంబన కోసం 'స్త్రీ శక్తి' ద్వారా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, 'దీపం 2.0' కింద ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామని చంద్రబాబు వివరించారు. రానున్న రోజుల్లో 5 లక్షల మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు. యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని జెన్ జీ, జెన్ ఆల్ఫా తరం ఆలోచనలకు అనుగుణంగా విధానాలు రూపొందిస్తున్నామని తెలిపారు. ఏఐ, ఏరోస్పేస్, సెమీ కండక్టర్స్ వంటి ఆధునిక రంగాలకు ఆంధ్రప్రదేశ్‌ను చిరునామాగా మారుస్తామని ధీమా వ్యక్తం చేశారు. 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' స్థానంలో 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానాన్ని అమలు చేస్తున్నామని, దీని ద్వారానే 23 నెలల్లో రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించామని అన్నారు. ఫైటర్ జెట్, బుల్లెట్ మోటార్‌సైకిల్ వంటి ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు ఇచ్చామని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ ద్వారా 15,941 ఉపాధ్యాయ పోస్టులను, 5,757 కానిస్టేబుల్ ఉద్యోగాలను భర్తీ చేసిందని చంద్రబాబు వెల్లడించారు. తమ పార్టీ వచ్చే ఎన్నికల కోసం కాకుండా, వచ్చే తరాల భవిష్యత్తు కోసం పనిచేస్తుందని పునరుద్ఘాటించారు. ఆకాశమే హద్దుగా అవకాశాలను అందిపుచ్చుకోవాలని యువతకు ఆయన పిలుపునిచ్చారు.

## ఓటరు జాబితాలో పేరు లేకపోతే పౌరసత్వం పోయినట్లు కాదు

- మొదటి పేజి తరువాయి

కూడిన ధర్మాసనం ఈ కీలక ఆదేశాలు జారీ చేసింది. ఓటరు జాబితా సవరణ కేవలం ఎన్నికల్లో పాల్గొనేందుకు మాత్రమే పరిమితమని పేర్కొంది. ఓటరు జాబితాలో పేరు చేర్చాలా? వద్దా? అని నిర్ణయించే అధికారం మాత్రమే ఎన్నికల సంఘానికి ఉందని స్పష్టం చేసింది. అంతేకానీ ఒక వ్యక్తి పౌరసత్వాన్ని నిర్ధారించే హక్కు ఈసీకి లేదని తెలిపింది.

**అనుమానిత పేర్లు కేంద్రానికి**

పౌరసత్వంపై అనుమానంతో ఓటరు జాబితా నుంచి తొలగించిన వారి పేర్లను మాత్రం కేంద్ర హోం శాఖకు పంపాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. ఈ వివరాలను నాలుగు వారాల్లోగా కేంద్ర ప్రభుత్వానికి అప్పగించాలని స్పష్టం చేసింది. ఈ తీర్పుతో గత కొంతకాలంగా ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలకు తెరపడింది.

**ఎన్నికలలోపే తేల్చాలి**

కేంద్ర ప్రభుత్వం ఈ వివరాలను అందుకున్న తర్వాత పౌరసత్వ చట్టం 1955 ప్రకారం ఆయా వ్యక్తుల పౌరసత్వ క్లెయిములపై విచారణ జరపాలని కోర్టు పేర్కొంది. తదుపరి అసెంబ్లీ లేదా స్థానిక సంస్థల ఎన్నికల కంటే ముందే ఈ వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించింది. ఒకవేళ విచారణలో వారు భారత పౌరులని తేలితే వెంటనే వారి పేర్లను మళ్లీ ఓటరు జాబితాలో పునరుద్ధరించాలని సుప్రీంకోర్టు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసింది.

## ప్రధాని మోదీతో 20 నిమిషాలు సీఎం విజయ్ భేటీ.. పలు విజ్ఞప్తులు

దేశ రాజధాని ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్రమోదీని తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ కలిశారు. తన మొదటి అధికారిక పర్యటనలో భాగంగా ప్రధానితో 20 నిమిషాల పాటు సమావేశమైన ముఖ్యమంత్రి, తమిళనాడుకు సంబంధించిన వివిధ అంశాలపై విజ్ఞప్తి చేశారు. నెదర్లాండ్స్ నుంచి ఇటీవల పురాతన రాగి ఫలకాలను తిరిగి తీసుకువచ్చినందుకు ప్రధాని మోదీకి విజయ్ ధన్యవాదాలు తెలిపారు.మేకెదాటు ప్రాజెక్టుకు కర్ణాటకకు అనుమతి ఇవ్వవద్దని ప్రధానిని కోరారు. ఈ ప్రాజెక్టు వల్ల తమిళనాడులోని దిగువ ప్రాంతాల్లో నీటిలభ్యతపై ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే, రాష్ట్రంలో ప్రభుత్వ కార్యక్రమాల ప్రారంభంలో రాష్ట్ర గీతాన్ని ప్లే చేయడానికి అనుమతించాలని కోరారు.విజయ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సమయంలో వందేమాతరం గీతాన్ని మొదట పూర్తిస్థాయిలో ఆలపించారు.

ఆ తర్వాత జాతీయ గీతం జనగణమన, తమిళ గీతాన్ని ఆలపించారు. ఈ నేపథ్యంలో విజయ్ తొలుత రాష్ట్ర గీతాన్ని ప్లే చేయడానికి అనుమతించాలని కోరారు.కర్ణాటక, తమిళనాడు

రాష్ట్రాల సరిహద్దుల్లో ఏకపక్షంగా ఏ ప్రాజెక్టు నిర్మించినా అది కావేరీ జల ట్రైబ్యునల్, సుప్రీంకోర్టు తీర్పు స్ఫూర్తికి విరుద్ధమని ప్రధాని మోదీ దృష్టికి సీఎం విజయ్ తీసుకువచ్చారు. అలాంటి మేకెదాటు ప్రాజెక్టుకు కేంద్రం అనుమతించకూడదని కోరారు. ఈ మేరకు జలశక్తి మంత్రిత్వ శాఖను ఆదేశించాలని కోరారు.

### ఆఫ్‌లైన్ అయినా, హైబ్రిడ్ మోడల్ అయినా

## టీమ్ 11 కి బ్యాటింగ్ తప్పదు

- మొదటి పేజి తరువాయి

ప్రత్యేక పరిస్థితుల్లో హైబ్రిడ్ మోడల్‌లో నిర్వహిస్తున్నాం. మనం హైబ్రిడ్ మోడల్ అనగానే టీమ్ 11 సంబరాలు చేసుకున్నారంట. ఆఫ్‌లైన్ అయినా, హైబ్రిడ్ మోడల్ అయినా టీమ్ 11 కి బ్యాటింగ్ తప్పదు" అని స్పష్టం చేశారు.

**లెజెండ్... అన్న ఎన్టీఆర్!**

విశ్వవిఖ్యాత నట సార్వభౌమ శ్రీ నందమూరి తారక రామారావు గారు దేశానికి లెజెండ్. తెలుగువారి ఆత్మ గౌరవం, తెలుగు వారి పౌరుషం ఎన్టీఆర్. సినిమాల్లో కానీ, రాజకీయాల్లో కానీ ఆయన ట్రెండ్ ఫాలో అవ్వలేదు.. ట్రెండ్ సెట్ చేశారు. ఆయన రికార్డులు బద్దలు కొట్టడం ఎవరివల్లా సాధ్యం కాదు. దేశానికి సంక్షేమం, అభివృద్ధి పరిచయం చేసింది ఎన్టీఆర్. 2 రూపాయలకు కిలో బియ్యం, పెన్షన్, జనతా వస్త్రాలు, పక్కా ఇళ్లు, గురుకుల పాఠశాలలు, మధ్యాహ్న భోజన పథకం, పటేల్-పట్వారీ విధానం రద్దు, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, పరిశ్రమల ఏర్పాటు, రోడ్ల నిర్మాణం, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు వంటివి ప్రవేశపెట్టింది ఎన్టీఆర్. స్త్రీశక్తిని మొదట గుర్తించింది, మహిళలకు ఆస్తిలో సమాన హక్కు ఇచ్చింది, మహిళల కోసం ప్రత్యేకంగా పద్మావతి యూనివర్సిటీ పెట్టింది, మహిళలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు ఇచ్చింది అన్న ఎన్టీఆర్... అని లోకేశ్ ప్రశంసించారు.

### ఎబోలా ముప్పు: భారత్‌లో లేదు..

## కానీ నిఘా తీవ్రం!

- మొదటి పేజి తరువాయి

ఇప్పటివరకు ఎలాంటి కేసులు నమోదు కాలేదని స్పష్టం చేసింది. అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో నిఘాను తీవ్రం చేసింది. విమానాశ్రయాలు, సరిహద్దుల్లో తనిఖీలను పటిష్ఠం చేసింది. ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని కేంద్ర ఆరోగ్య శాఖ భరోసా ఇచ్చింది.

బెంగళూరులో అనుమానిత కేసు నెగెటివ్

ఇటీవల ఉగాండా నుంచి కర్ణాటకకు వచ్చిన ఓ వ్యక్తికి ఒళ్లు నొప్పులు రావడంతో అధికారులు ముందస్తు జాగ్రత్తగా బెంగళూరులో ఐసోలేషన్‌లో ఉంచారు. ఆ వ్యక్తి నుంచి సేకరించిన నమూనాలను పూణెలోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి పంపారు. ఆ పరీక్షల్లో అతనికి ఎబోలా నెగెటివ్ అని తేలడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఆఫ్రికా నుంచి వచ్చారనే కారణంతోనే ఈ ముందస్తు పరీక్షలు నిర్వహించినట్లు వైద్యులు స్పష్టం చేశారు.

**విమానాశ్రయాల్లో గట్టి నిఘా**

ప్రస్తుత గ్లోబల్ హెల్త్ ప్యాటర్న్‌ను గమనిస్తూ కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ నిరంతరం పర్యవేక్షిస్తోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ మార్గదర్శకాల ప్రకారం అన్ని రకాల పబ్లిక్ హెల్త్ ప్రొటోకాల్స్‌ను అమలు చేస్తోంది. దేశంలోకి వైరస్ ప్రవేశించకుండా ఎంట్రీ పాయింట్లు, అంతర్జాతీయ విమానాశ్రయాల వద్ద నిరంతర స్క్రీనింగ్ ప్రక్రియను కొనసాగిస్తోంది. వైరస్ ముందస్తు గుర్తింపు కోసం దేశవ్యాప్త రెస్పాన్స్ మెకానిజంను మరింత బలోపేతం చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది.

**ఆఫ్రికాలో విస్తరణ**

మరోవైపు ఆఫ్రికా ఖండంలో బుండిబుగ్యో ఎబోలా వేరియంట్ తీవ్రత భయాందోళనలు కలిగిస్తోంది. కాంగోలో ఇప్పటివరకు 101 అధికారిక కేసులు, 10 మరణాలు నమోదైనట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ అధినేత టెడ్రోస్ అధానోమ్ తెలిపారు. అయితే క్షేత్రస్థాయిలో మరో 900కి పైగా అనుమానిత కేసులు, 220 మరణాలు పరిశీలనలో ఉన్నాయని, వైరస్ ఉద్ధృతి అంచనాలకు మించి ఉందని హెచ్చరించారు. పొరుగు దేశమైన ఉగాండాలోనూ ఇద్దరు వైద్య సిబ్బందితో కలిసి మొత్తం ఏడు కేసులు నమోదయ్యాయి.

# రోడ్డును పరిశీలించిన మంత్రి జనార్ధన్ రెడ్డి



**గిద్దలూరు పెన్ పవర్ మే 27**

గిద్దలూరు మండలం దిగుమెట్ట సమీపంలో గిద్దలూరు -- నంద్యాల రహదారి అభివృద్ధి పనులను రోడ్డు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. జరుగుతున్న పనుల పురోగతి, నాణ్యత ప్రమాణాలను ప్రత్యక్షంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. రహదారి నిర్మాణంలో ఎలాంటి రాజీ లేకుండా అత్యుత్తమ నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులకు సూచించారు. ప్రజలకు మెరుగైన, నాణ్యమైన రహదారులను అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యంఅని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలను మరింత బలోపేతం చేస్తూ అభివృద్ధి దిశగా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు.

పెన్ పవర్
MARKAPURAM మార్కాపురం
మార్కాపురం - ప్రకాశం

# అట్టహాసంగా ప్రారంభమైన మహానాడు

## ఎమ్మెల్యే ఇంటూరి ఆధ్వర్యంలో సందడిగా వేడుకలు

## 12 క్లస్టర్లలో ప్రత్యేక వేదికల ఏర్పాటు

## స్వర్గీయ ఎన్టీఆర్ కు ఘన నివాళి

## నియోజకవర్గ వ్యాప్తంగా సత్తాచాటిన పసుపు సైన్యం













**కందుకూరు పెన్ పవర్, మే 27:**

మహానాడు తొలిరోజు కందుకూరు నియోజకవర్గంలో అట్టహాసంగా సాగింది. ఈ ఏడాది మహానాడును వర్చువల్ గా నిర్వహిస్తుండడంతో నియోజకవర్గంలోని 12 క్లస్టర్లలో ప్రత్యేక వేదికలు ఏర్పాటుచేసి కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సారథ్యంలో పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొన్నాయి. ప్రతిచోటా అన్ని వర్గాల ప్రజలు ముఖ్యంగా మహిళలు, యువకులు, అన్నగారి అభిమానులు వేలాదిగా తరలివచ్చి వేడుకల్లో పాలుపంచుకున్నారు. స్వర్గీయ నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా, ఆయనను స్మరించుకుంటూ ఘనంగా నివాళులు అర్పించారు. కందుకూరు పట్టణంలో వెంగమాంబ, ఎస్వీఎస్, లక్ష్మీతిరుమల, అలావారి కళ్యాణ మండపాల్లో మహానాడు నిర్వహించారు. అలాగే లింగసముద్రంలో వేముల అంజయ్య కళ్యాణమండపం, ఉలవపాడులో భోగినేని చెంచురామానాయుడు కళ్యాణమండపం, గుడ్లూరులో గుండా ఆదిశేషయ్య వరలక్ష్మమ్మ కళ్యాణమండపం, గొల్ల కంటయ్య లక్ష్మమ్మ కళ్యాణ మండపాల్లో జరిగిన వేడుకలకు పసుపు తమ్ముళ్లు పోటెత్తారు.కందుకూరులోని లక్ష్మీ తిరుమల కళ్యాణ మండపంలో జరిగిన మహానాడు కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. తరువాత నియోజకవర్గంలోని అన్ని క్లస్టర్లలో జరిగిన వేడుకలకు ఆయన హాజరై, అక్కడ కార్యక్రమాలను పరిశీలించడంతోపాటు శ్రేణులను ఉత్సాహపరిచారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు , యువ నాయకులు నారా లోకేష్ , ఇతర నేతల ప్రసంగాలు, రాజకీయ తీర్మానాలు, ఇతర కార్యక్రమాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్క్రీన్ల ద్వారా నాయకులు కార్యకర్తలు వీక్షించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు వివిధ కార్యక్రమాలు జరిగాయి. ముందుగా ప్రతిచోట పార్టీ జెండాలను ఆవిష్కరించిన తర్వాత ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పార్టీ సభ్యత్వ కార్డుల ద్వారా, ఎమ్మెల్యే సహా ప్రతి ఒక్కరూ మహానాడులో తమ పేర్లను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా పలుచోట్ల నాగేశ్వరరావు పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడుతూ.... తెలుగుజాతి ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి స్వర్గీయ నందమూరి తారక రామారావు అని కొనియాడారు. ప్రజలకు కూడు, గూడు, గుడ్డ తప్పనిసరిగా అందించాలన్న లక్ష్యంతో తెలుగుదేశం పార్టీని స్థాపించి, 9 నెలల్లోనే అధికారంలోకి వచ్చి, ఎవరు ఊహించని విధంగా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశారని చెప్పారు. మొదట సినిమాలు, ఆపై రాజకీయరంగంలో తిరుగులేని నేతగా ఎదిగారని అన్నారు. ఎన్టీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక ఆయన తెచ్చిన సంస్కరణలు, ఇప్పటికీ ప్రజల గుండెల్లో నిలిచి ఉన్నాయని ఎమ్మెల్యే తెలిపారు. ఎంతోమంది విద్యావంతులు, మహిళలకు టిక్కెట్లు ఇచ్చి, వారిని చట్టసభలకు పంపిన ఘనత అన్నగారిదని పేర్కొన్నారు.

ఎన్టీఆర్ వారసుడిగా చంద్రబాబునాయుడు అమలు చేసిన పథకాలు, అనుసరించిన విధానాలు... ఆంధ్ర రాష్ట్ర దశాదిశను సమూలంగా మార్చాయన్నారు. హైదరాబాద్ ను గుర్తుకుతెచ్చుకుంటే, చంద్రబాబు విజనరీ ఏంటో తెలుస్తుందన్నారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత, చంద్రబాబు ముందుచూపుతో లెక్కపెట్టలేనని పరిశ్రమలు రాష్ట్రానికి వచ్చాయన్నారు. అమరావతి, పోలవరం, పట్టిసీమ, విశాఖ రైల్వే జోన్, విశాఖ ఐటీ హబ్, సీఎం రిలీఫ్ ఫండ్, అన్న క్యాంటీన్లు....ఇలా చెప్పుకుంటూ పోతే, చంద్రబాబు రికార్డులు చాలా ఉన్నాయని ఎమ్మెల్యే గుర్తు చేశారు. యువగళం పాదయాత్రతో లోకేష్ తన పవర్ చూపించారని, రాష్ట్రానికి భవిష్యత్తు నాయకుడు ఆయనేనని, మనమందరం లోకేష్ నాయకత్వంలో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే నాగేశ్వరరావు స్పష్టం చేశారు. కందుకూరు నియోజకవర్గంలో ఈ రెండేళ్లలో జరిగిన అభివృద్ధి గురించి తాను ప్రత్యేకంగా చెప్పనవసరం లేదని ఎమ్మెల్యే ఇంటూరి అన్నారు. 20 ఏళ్లలో ఎవరూ చేయలేని అభివృద్ధిని తాను చూపించానని, ఈ యజ్ఞం వచ్చే మూడేళ్లపాటు పెద్ద ఎత్తున జరగబోతుందని తెలిపారు. పట్టణంలో సెంట్రల్ లైటింగ్, డివైడర్లు, రోడ్డు విస్తరణ పనులు, సీసీ మరియు తారు రోడ్లు, డ్రైనేజీ కాలువలు, బ్రిడ్జిలు, కొత్త ఆలయాల నిర్మాణం, 100 ఎకరాల్లో ఎం ఎస్ ఎం ఈ పార్కు, ఇండోసోల్ మరియు బిపిసిఎల్ పరిశ్రమలు, వందల ఎకరాల ప్రైవేటు భూములపై నిషేధం ఎత్తివేయడం, తాగునీటి సమస్య శాశ్వత నివారణ లాంటి కార్యక్రమాలను ముఖ్యమంత్రి చంద్రబాబు , నారా లోకేష్ సహకారంతో చేపట్టినట్లు తెలిపారు. సుమారు 12 కోట్ల రూపాయలతో 1300 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందించడం ఎంతో సంతోషాన్నిస్తోందన్నారు.

ప్రజా సేవకుడుగా తనకు అవకాశం ఇచ్చిన నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని, ప్రతి కార్యకర్తకు, ప్రతి నాయకుడికి న్యాయం జరిగేలా చూడడమే తన ప్రథమ కర్తవ్యం అని ఎమ్మెల్యే నాగేశ్వరరావు పేర్కొన్నారు. ప్రజలందరి సహకారంతో రాబోయే 2029 ఎన్నికల్లో గతంలో కంటే ఎక్కువ మెజారిటీతో గెలిచి చూపిస్తానని, కందుకూరు నియోజకవర్గాన్ని సమూలంగా రూపురేఖలు మార్చేలా 24 గంటలు కష్టపడతానని, అందుకు ప్రతి ఒక్కరూ ఆశీర్వదించాలని ఎమ్మెల్యే నాగేశ్వరరావు కోరారు. మహానాడు రెండవ రోజున శుక్రవారం పసుపు సైనికులు మరింత ఉత్సాహంతో పాల్గొని మహానాడు ను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. అన్నిచోట్ల కార్యకర్తలకు భోజన వసతులు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమాల్లో నియోజకవర్గ పరిశీలకురాలు మట్టం శ్రావణి రెడ్డి, పట్టణ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, మండల పార్టీల అధ్యక్షులు పూరిమిట్ల గురునాథం, జనిగర్ల నాగరాజు, రాచగర్ల సుబ్బారావు, మాదాల లక్ష్మీనరసింహం, బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, క్లస్టర్ ఇన్చార్జులు కాకుమాని హర్ష, ఘట్టమనేని లక్ష్మీనర సింహం, వంకాయలపాటి మాల్యాద్రి, వడ్డెళ్ళ రవిచంద్ర, చిలకపాటి మధు, గొంది నరసింగరావు, బొద్దులూరి కొండలరావు, చిత్తారు మల్లికార్జున, ఉమ్మనేని సుబ్బారావు, పోలుబోయిన శ్రీనివాసులు, బెల్లం కృష్ణమోహన్, వాసు, నెల్లూరు పార్లమెంట్ ఉపాధ్యక్షులు ఉన్నం వీరా స్వామి, పార్టీ సీనియర్ నాయకులు పిడికిటి వెంకటేశ్వర్లు, చల్లా శ్రీనివా సరావు, కంద్రా మాల్యాద్రి, ఉప్పుటూరి శ్రీనివాసరావు, నార్నె రోశయ్య, అల్ల వెంకటేశ్వర్లు, చిడిపోతు వెంకట సురేష్ బాబు,ఏపీఈడబ్ల్యూఐడి కార్పొరేషన్ డైరెక్టర్ పోకూరి రాంబాబు, రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్, నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షుడు షేక్ మున్నా, రాయపాటి శ్రీనివాసరావు, రెబ్బవరపు మాల్యాద్రి, నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు కల్లూరి శైలజ, నియోజకవర్గ తెలుగు ప్రొఫె షనల్ వింగ్ అధ్యక్షురాలు పువ్వాడి మౌనిక, గ్రామ వార్డు అధ్యక్షులు, యూనిట్ ఇన్చార్జులు, అనుబంధ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# వైద్యశాలలను పరిశీలించిన మార్కాపురం జిల్లా కలెక్టర్ విజయ సునీత

**గిద్దలూరు,పెన్ పవర్ మే 27**

రాష్ట్ర ప్రభుత్వం కృత్రిమ మేథ పరిజ్ఞానం సాయంతో ఆధునిక, మెరుగైన వైద్య సేవల కోసం సంజీవని నర్వ్ డిజిటల్ హెల్త్ కేంద్రాల ఏర్పాటుకు సంకల్పించింది. ఈ నేపథ్యంలో మార్కాపురం జిల్లా గిద్దలూరు నియోజకవర్గ పరిధిలో సంజీవని నర్వ్ డిజిటల్ హెల్త్ కేంద్రాల ఏర్పాటుకు అనువైన ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలను జిల్లా కలెక్టర్ విజయ సునీత గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డితో కలిసి బుధవారం బేస్తవారి పేట, కొమరోలు, కె.ఎస్ పల్లె వైద్యశాలలను పరిశీలించారు. ఆయా ఆసుపత్రుల్లో ప్రస్తుత మౌలిక సదుపాయాలు, వైద్య వసతులు, సిబ్బంది వివరాలు పరిశీలించారు.కలెక్టర్ వెంట జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు ,తహసీల్దార్ ఆంజనేయ రెడ్డి ఉన్నారు.





# ప్రకాశంజిల్లాకు తలమానికంగా మారనున్న రామాయపట్నం పోర్ట్

- మొదటివిడత నిర్మాణ పనులు నిర్దిష్టగడువులో పూర్తిచేసేలా చర్యలు
- పోర్టు నిర్వాసితులకు నిర్మిస్తున్న గృహ నిర్మాణాలు పరిశీలన
- తెట్టు నుండి పోర్టుకు చేపడుతున్న రైల్వేలైన్ పనుల పరిశీలన
- మాజీ సర్పంచ్ రమణయ్య రొయ్యల హేచరీ పరిశీలించిన కలెక్టర్
- చేవూరులో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ మ్యాపింగ్ ప్రక్రియ పరిశీలన.
- జిల్లాలో 80 శాతం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి: కలెక్టర్





**గుడ్లూరు, పెన్ పవర్, మే 27:**

ప్రకాశం జిల్లాకు తలమానికంగా మారనున్న రామాయపట్నం పోర్ట్ మొదటి విడత నిర్మాణ పనులు నిర్దిష్టమైన గడువులోపు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు సంబంధిత పోర్టు అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, జాయింట్ కలెక్టర్ శ్రీమతి కల్పనా కుమారి, కందుకూరు సబ్ కలెక్టర్ హిమవంశి లతో కలసి బుధవారం రామాయపట్నం పోర్టును సందర్శించి, పోర్టు నిర్మాణ పనులను, పోర్టు నిర్వాసితులకు నిర్మిస్తున్న గృహ నిర్మాణాలను పరిశీలించి, సంబంధిత పనులు నిర్దిష్టమైన గడువులోపు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తొలుత జిల్లా కలెక్టర్ రామాయపట్నం పోర్టు పరిధిలోని కర్లపాలెం గ్రామ నిర్వాసితులకు తెట్టు వద్ద నిర్మిస్తున్న పునరావాస కాలనీని సందర్శించి నిర్మాణ పురోగతిని పరిశీలించి వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ తెట్టు నుండి పోర్టు వరకు చేపడుతున్న రైల్వే లైన్ పనులను పరిశీలించారు. తదుపరి సాలిపేట లోని ఎస్.టి కాలనీ ని సందర్శించి గ్రామస్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సాలిపేటలోని రమణయ్యకు చెందిన రొయ్యల హేచరీని పరిశీలించారు. తదుపరి పోర్టు పరిపాలనా భవన నిర్మాణాన్ని, పోర్టు నిర్మాణ పనులను పరిశీలించి పోర్టు నిర్మాణ పనుల పురోగతి, భూ సేకరణపై సంబంధిత అధికారులతో సమీక్షించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయా పనుల పురోగతిని అధికారులు, పోర్టు నిర్మాణ కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా కలెక్టరుకు వివరించారు. పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని వారిని కలెక్టర్ ఆదేశించారు.

అనంతరం జిల్లా కలెక్టర్ చేవూరు గ్రామాన్ని సందర్శించి గ్రామంలో చేపడుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ మ్యాపింగ్' ప్రక్రియ ను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్వయంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ మ్యాపింగ్ ప్రక్రియ విధానాన్ని పరిశీలించడంతో పాటు ఎంత శాతం ప్రక్రియ పూర్తి చేసారు, ఏ విధంగా చేస్తున్నారు అని అడిగి తెలుసుకున్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ మ్యాపింగ్ ప్రక్రియలో నిర్లక్ష్యం వద్దని, వంద శాతం ఓటర్ల మ్యాపింగ్ లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఎన్నికల విధుల నిర్వహణలో అత్యంత పారదర్శకత, నాణ్యత ఉండాలని, నిబంధనల ప్రకారం మ్యాపింగ్ పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ రోజు రామాయపట్నం పోర్టు పరిధిలో చేపడుతున్న నిర్మాణ పనులను, అలాగే చేపడుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ మ్యాపింగ్ ప్రక్రియను పరిశీలించేందుకు జాయింట్ కలెక్టర్, సబ్ కలెక్టర్ వారితో కలసి రావడం జరిగిందన్నారు. పోర్టు నిర్మాణ పనులను పరిశీలించడం జరిగిందని, నిర్మాణ పనులన్నీ శరవేగంగా జరుగుచున్నవని తెలిపారు. నిర్దిష్టమైన గడువులోపు నిర్మాణ పనులు పూర్తి చేసేలా పనులు చేపట్టడం జరుగుచున్నవన్నారు. గ్రామస్థులతో, పోర్టు అధికారులతో మాట్లాడటం జరిగిందని తెలిపారు. అలాగే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ మ్యాపింగ్ ప్రక్రియ కు సంబంధించిన యాప్ పని విధానాన్ని కూడా పరిశీలించడం జరిగిందని, సంబంధిత యాప్ కూడా బాగా పనిచేస్తున్నదని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో దాదాపు 80 శాతం మేర స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి కావడం జరిగిందని తెలిపారు. పోర్టు నిర్మాణం త్వరగా పూర్తి చేసేందుకు ప్రభుత్వ పరంగా అవసరమైన సహాయ సహకారాలు అందించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట మ్యారీ టైమ్ బోర్డు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శివరాం, తహసిల్దార్ బాల కిషోర్, నవయుగ సంస్థ ప్రతినిధులు, స్థానిక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మహానాడు నిర్వహణలో కందుకూరుకు నాలుగో స్థానం



**కందుకూరు పెన్ పవర్, మే 27**

తెలుగుదేశం పార్టీ వర్చువల్ విధానంలో నిర్వహిస్తున్న 2026 మహానాడుకు రాష్ట్రవ్యాప్తంగా కార్యకర్తల నుండి విశేష స్పందన లభించింది. దీనిలో భాగంగా కందుకూరు నియోజకవర్గంలో 12 క్లస్టర్లలో 8806 హాజరై రాష్ట్రంలో నాలుగో స్థానంలో నిలిచింది. కందుకూరు నియోజకవర్గం లో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. కందుకూరు నియోజకవర్గానికి నాలుగవ స్థానం రావడంతో తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఉత్సాహంగా ఉన్నారు.రేపు రెండవ రోజు కూడా ఇదే స్థాయిలో అధిక సంఖ్యలో మహానాడులో పాల్గొని విజయవంతం చేస్తారని కందుకూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## ఫాదర్ బి మనోహర్ సేవలు అభినందనీయం

### జిల్లా బీటీపీ అధ్యక్షులు ఎల్ ఆంటోనీ



**సి ఎస్ పురం, పెన్ పవర్ మే 27**

గణేశునిపల్లి చర్చి ఫాదర్ బి మనోహర్ చర్చి అభివృద్ధికి కృషి చేస్తూ ఐదు సంవత్సరాలు విశేష సేవలు అభినందనీయమని జిల్లా బిటిపి అధ్యక్షులు లక్కీపోగు ఆంటోనీ అన్నారు మండలంలోని అంబవరం గ్రామంలో ఉన్న సెయింట్ ఆంతోని మండపం వద్ద బుధవారం గణేశు నిపల్లి విచారణ ఫాదర్ బి.మనోహర్ కు చర్చి పెద్దలు, కతోలిక విశ్వాసులు ఘన సన్మానం నిర్వహించారు. గత ఐదు సంవత్సరాలుగా గణేశునిపల్లి విచారణ పరిధిలో ఆధ్యాత్మిక సేవలు అందిస్తూ చర్చి అభివృద్ధికి విశేషంగా కృషి చేసిన ఫాదర్ మనోహర్ సేవలను ఈ సందర్భంగా పలువురు చర్చి పెద్దలు కొనియాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా బిటిపి అధ్యక్షులు లక్కిపోగు ఆంటోని మాట్లాడుతూ ఫాదర్ బి.మనోహర్ తన సేవా కాలంలో అంబవరం, రేగులచెలక, కొత్తపల్లి, చెన్నపునాయునిపల్లి, వి బైలు తదితర గ్రామాల్లోని కతోలిక విశ్వాసులకు ఆధ్యాత్మిక బోధనలు అందిస్తూ విశ్వాసాన్ని బలోపేతం చేశారని తెలిపారు. ప్రార్ధనలు, ప్రత్యేక ఆరాధనలు నిర్వహించి యువతలో ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందించారని పేర్కొన్నారు.అలాగే చర్చి అభివృద్ధి, ప్రార్థనా మందిరాల నిర్వహణ, విశ్వాసుల ఐక్యత కోసం ఫాదర్ మనోహర్ చేసిన కృషి మరువలేనిదని అన్నారు. పేద ప్రజల సమస్యలను తెలుసుకొని వారికి అండగా నిలుస్తూ సేవా భావంతో పనిచేశారని కొనియాడారు.ఈ సందర్భంగా చర్చి పెద్దలు ఫాదర్ మనోహర్ ను శాలువా కప్పి పూలమాలలతో సత్కరించి జ్ఞాపిక ను అందజేశారు. అనంతరం ఫాదర్ మనోహర్ మాట్లాడుతూ తనపై చూపిన అభిమానానికి విశ్వాసులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడ పనిచేసిన నాకు ప్రజల ఆశీర్వాదాలు, సహకారం మరువలేనివని అన్నారు ఈ కార్యక్రమంలో పారా రాజేష్, యేసు రత్నం, నవీన్, లీవిస్, జాన్సన్, లక్కిపోగు ధోని, చర్చి పెద్దలు లక్కీపోగు ప్రసాద్, పారా తిరుపాలు శివ, మహిళలు చర్చి కమిటీ సభ్యులు యువకులు కతోలిక విశ్వాసులు పాల్గొని ఆయన సేవలను కొనియాడి ఘనంగా సన్మానించారు

## ఓటరు జాబితాను వేగవంతంగా పూర్తి చేయాలి -జిల్లా కలెక్టర్ విజయ సునీత

**మార్కాపురం పెన్ పవర్ మే27**

2002 నాటి ఓటర్ జాబితాలోని వివరాలను ప్రస్తుత ఓటర్ జాబితా తో అనుసంధానం చేసే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత అధికారులు ఆదేశించారు. బుధవారం మార్కాపురం పట్టణంలోని భగత్ సింగ్ కాలనీ, అదేవిధంగా మండలంలోని వేములకోట గ్రామంలోని పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న ప్రత్యేక ముమ్మర పునర్విమర్శ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడతూ జూన్ 6వ తేదీ నాటికి ఈ ప్రక్రియను పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని బూత్ స్థాయి అధికారులను ఆదేశించారు. అంతకుముందు భగత్ సింగ్ కాలనీలో పర్యటించిన జిల్లా కలెక్టర్ ను ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కాలనీవాసులు వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ వెంకట శివరామిరెడ్డి, తాహసిల్దార్ చిరంజీవి, ఇతర మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



# గిద్దలూరు నియోజకవర్గంలో అట్టహాసంగా మహానాడు వేడుకలు

### కార్యకర్తల్లో తగ్గని జోష్

### పసుపు మాయమైన గిద్దలూరు

### విధానం మారింది , విధానాలు అవే

### ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి

**గిద్దలూరు పెన్ పవర్ మే27**

తెలుగుదేశం పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మహానాడు వేడుకలు గిద్దలూరు నియోజకవర్గంలో ఘనంగా, ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగుతున్నాయి. నియోజకవర్గంలోని అన్ని మండలాల పరిధిలో ఏర్పాటు చేసిన 10 క్లస్టర్లలో మహానాడు కార్యక్రమాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున నిర్వహించారు. ప్రతి క్లస్టర్‌లో పండుగ వాతావరణం నెలకొనగా, పార్టీ శ్రేణుల్లో అపార ఉత్సాహం ఉరకలు వేసింది .ఈ సందర్భంగా పట్టణంలోని క్లస్టర్-9 తిరుమల కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన మహానాడు వేడుకలకు గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే కు నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే , వందేమాతరం గేయంతో దేశభక్తి భావాలను చాటారు. అనంతరం తెలుగుదేశం పార్టీ జెండాను ఆవిష్కరించి పార్టీ పట్ల తమ అంకితభావాన్ని వ్యక్తపరిచారు. పార్టీ వ్యవస్థాపకుడు, తెలుగు ప్రజల ఆత్మగౌరవ ప్రతీక స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. మహానాడు వేడుకలలో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చిన్నారులు ప్రదర్శించిన దేశభక్తి, సామాజిక చైతన్య నృత్యాలు



అందరినీ అలరించాయి. మహిళలు, యువత, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొని వేడుకలను మరింత కళకళలాడేలా చేశారు. తెలుగుదేశం పార్టీ పాటలకు కార్యకర్తలు నృత్యాలు చేస్తూ సభా ప్రాంగణాన్ని సందడిగా మార్చారు. డిజిటల్ మహానాడు నిర్వహణలో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా నాయకులు, కార్యకర్తలు వీక్షించారు . రాష్ట్ర భవిష్యత్ అభివృద్ధి, యువత ఉపాధి, సంక్షేమ పథకాల అమలు, సాంకేతిక వినియోగం వంటి అంశాలపై సీఎం చేసిన ప్రసంగం కార్యకర్తల్లో నూతన ఉత్తేజానీ నింపింది .అనంతరం ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి మాట్లాడుతూ, భవిష్యత్ తరాల అవసరాలను దృష్టిలో పెట్టుకుని సాంకేతికతను వినియోగిస్తూ డిజిటల్ మహానాడు నిర్వహించడం అభినందనీయమన్నారు . ఇంధన పొదుపు, సమయ నిర్వహణ, ప్రతి కార్యకర్తకు మహానాడు కార్యక్రమాలను చేరువ చేయాలనే లక్ష్యంతో ఈ విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. అన్ని క్లస్టర్లలో ఒకేసారి మహానాడు



నిర్వహించడం ద్వారా గ్రామ స్థాయి కార్యకర్తల వరకు పార్టీ సిద్ధాంతాలు చేరుతున్నాయని చెప్పారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలు, మహిళలు, రైతులు, యువత, విద్యార్థులు, నిరుద్యోగుల సంక్షేమం కోసం చేపడుతున్న కార్యక్రమాలను ఎమ్మెల్యే వివరించారు. రాష్ట్ర అభివృద్ధి, పారదర్శక పాలన, పెట్టుబడుల ఆహ్వానం, యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాల కల్పనలో ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు . పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. మహానాడు కేవలం పార్టీ కార్యక్రమం మాత్రమే కాకుండా తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని చాటిచెప్పే మహోత్సవమన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, మహిళా నాయకులు, యువ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని మహానాడు లో పాల్గొన్నారు.

# ప్రకాశం విద్యార్థులకు మహారత్న సంస్థలో అరుదైన అవకాశం

### బిహెచ్ఈఎల్ ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైన మూడవ, నాలుగవ సంవత్సరం విద్యార్థులు




**కందుకూరు పెన్ పవర్, మే 27**

సాంకేతిక విద్యలో అత్యున్నత ప్రమాణాలను నెలకొల్పుతూ విద్యార్థులను జాతీయ స్థాయి అవకాశాల వైపు దారితీస్తున్న ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల మరో విశిష్ట విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. కళాశాలకు చెందిన మూడవ సంవత్సరం మరియు నాలుగవ సంవత్సరం ఇంజనీరింగ్ విద్యార్థులు దేశ ప్రఖ్యాత మహారత్న ప్రజారంగ సంస్థ అయిన భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (బిహెచ్ఇఎల్), హైదరాబాద్‌లో నిర్వహించబడుతున్న ప్రతిష్ఠాత్మక ఇంటర్న్‌షిప్ కార్యక్రమానికి ఎంపిక కావడం కళాశాల ప్రతిష్ఠను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లింది. భారతదేశ పారిశ్రామిక అభివృద్ధికి కీలకంగా నిలిచిన బిహెచ్ఇఎల్‌కు "మహారత్న" హోదా లభించడం ఆ సంస్థకు ఉన్న విశ్వసనీయత, సాంకేతిక ప్రతిభ, జాతీయ స్థాయి ప్రాధాన్యతకు నిదర్శనంగా భావిస్తారు. విద్యుత్ ఉత్పత్తి, భారీ యంత్రాల తయారీ, ఎనర్జీ, రక్షణ, రైల్వేలు వంటి కీలక రంగాల్లో దేశానికి సేవలందిస్తున్న ఈ మహారత్న సంస్థలో ఇంటర్న్‌షిప్ అవకాశం రావడం విద్యార్థుల ప్రతిభకు లభించిన గొప్ప గుర్తింపుగా విద్యావేత్తలు పేర్కొంటున్నారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ కంచర్ల విజయ శ్రీనివాస్ మాట్లాడుతూ, "విద్యార్థులను కేవలం డిగ్రీలకే పరిమితం చేయకుండా పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలతో తీర్చిదిద్దడమే మా లక్ష్యం. బిహెచ్ఇఎల్ వంటి మహారత్న సంస్థలో ఇంటర్న్‌షిప్‌కు ఎంపిక కావడం మా విద్యార్థుల ప్రతిభకు, అధ్యాపకుల అంకితభావానికి నిదర్శనం. భవిష్యత్తులో ఇంకా ఎక్కువ మంది విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయి అవకాశాలను అందుకునేలా కళాశాల తరఫున ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు కొనసాగిస్తాం" అని తెలిపారు. ఈ ఇంటర్న్‌షిప్ ద్వారా విద్యార్థులు ఆధునిక ఎలక్ట్రికల్ సిస్టమ్స్, ఇండస్ట్రియల్ టెక్నాలజీ, ప్రొడక్షన్ ప్రాసెసెస్, కార్పొరేట్ వర్క్ కల్చర్, సేఫ్టీ స్టాండర్డ్స్ వంటి అంశాలపై ప్రత్యక్ష అవగాహన పొందనున్నారు. అంతేకాకుండా పరిశ్రమల్లో వాస్తవ పరిస్థితుల్లో పని చేసే అనుభవం, సాంకేతిక నైపుణ్యాల పెంపు, కమ్యూనికేషన్ మరియు ప్రొఫెషనల్ సామర్థ్యాల అభివృద్ధికి ఈ ఇంటర్న్‌షిప్ ఎంతో దోహదపడనుంది. భవిష్యత్ క్యాంపస్ ప్లేస్‌మెంట్స్, ఉన్నత విద్య, ప్రభుత్వ మరియు ప్రైవేట్ రంగ ఉద్యోగ అవకాశాల్లో ఈ అనుభవం విద్యార్థులకు ప్రత్యేక గుర్తింపును తీసుకురానుంది. విద్యార్థుల ఈ అరుదైన విజయంపై కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక వర్గం, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తూ ఎంపికైన విద్యార్థులను అభినందించారు. విద్యార్థుల ప్రతిభతో కళాశాల ఖ్యాతి మరింత పెరిగిందని, భావితరాలకు వారు ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. సాంకేతిక విద్యను పరిశ్రమల అవసరాలకు అనుసంధానం చేస్తూ ప్రతిభావంతులైన ఇంజనీర్లను తీర్చిదిద్దడంలో ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల మరోసారి తన ప్రత్యేకతను చాటుకుందని విద్యా వర్గాలు ప్రశంసిస్తున్నాయి.

## వీధికుక్కల దాడిలో 15 గొర్రెలు మృతి

### తీవ్ర ఆవేదనలో గొర్రెల యజమాని చిన్నబ్రహ్మయ్య



**గుడ్లూరు, పెన్ పవర్, మే 27:**

కుక్కల దాడిలో 15 గొర్రెలు మృతి చెందిన సంఘటన మండలంలోని జానకంపేట గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చినలాటరఫి గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న జానకంపేట గ్రామంలో కుక్కలు దాడి చేసి సుమారు లక్షన్నర విలువ కలిగిన గుండ్లపల్లి చిన్న బ్రహ్మయ్య కు చెందిన 15 గొర్రెలను దాడిచేసి చంపివేశాయి. విషయం తెలుసుకున్న చిన్న బ్రహ్మయ్య సంబంధ సచివాలయ సిబ్బంది తెలియజేయడంతో వారు మృతి చెందిన గొర్రెలను పరిశీలించారు. గొర్రెలు మేపుకుంటూ జీవనం సాగిస్తున్న చిన్న బ్రహ్మయ్యకు చేతికి వచ్చిన గొర్రెలు మృతి చెందడంతో తీవ్ర ఆవేదనకు గురయ్యారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి తనకు, తన కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని గొర్రెల యజమాని చిన్న బ్రహ్మయ్య వేడుకున్నారు. చాలా చోట్ల తరచూ కుక్కలు మనుషులతో పాటు, మూగ జీవాలపై దాడులు చేస్తూ భయభ్రాంతులను కలిగిస్తున్నాయని, కుక్కల బారిన పడకుండా, వీధికుక్కల నియంత్రణకు పంచాయితీ అధికారులు, మండల అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## సందడి సందడిగా మహానాడు వేడుకలు



**పొన్నలూరు, పెన్ పవర్ మే 27**

మహానాడు సందర్భంగా స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద బుధవారం మహానాడు వేడుకలు టిడిపి మండల అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు ఆధ్వర్యంలో కోలాహలంగా నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ దామచర్ల ఆంజనేయులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హైబ్రిడ్ విధానం ద్వారా మండలంలోని నాయకులు, కార్యకర్తలు ముఖ్య టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, లోకేష్ బాబు,వివిధ మంత్రుల ప్రసంగాలను ఆన్లైన్ ద్వారా వీక్షించారు. కార్యక్రమంలో దాదాపుగా 2000 మంది పాల్గొన్నారు. మహానాడు కార్యక్రమానికి వచ్చిన కార్యకర్తలకు అభిమానులకు భోజన వసతులు కల్పించారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కర్ణ తిరుపతమ్మ, మండల టిడిపి నాయకులు కొండ్రగుంట శ్రీనివాసరావు, కర్ణ కోటిరెడ్డి, మండవ ప్రసాద్, అనుమోలు రాజా రవీంద్ర, గుమ్మళ్ల వెంకట్రావు, మండవ మురళీమోహన్, ఉన్నం శ్రీనివాసరావు, గట్టి బోయిన మల్లికార్జున, మోరుబోయిన మాల్యాద్రి, తానికొండ మహేంద్ర, అనుమోలు సుధాకర్ బాబు, పిల్లి వెంకట నారాయణరెడ్డి, మన్నేం రమణయ్య, ఉన్నం కొండలరావు, వద్దే మాల్యాద్రి, నంది కనుమ బ్రహ్మయ్య, దాసరి కృష్ణారావు, మన్నేం మల్లికార్జునరావు, పల్లపోతు రమేష్ బాబు, వెంకట్రావు, టిడిపి కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# రాచెర్ల మండల మహానాడులో ముత్తుముల క్రిష్ణ కిశోర్





**గిద్దలూరు పెన్ పవర్ మే 27**

గిద్దలూరు నియోజకవర్గం రాచర్ల లో స్పందన స్కూల్ వెనుక మహానాడు వేడుకలను ఘనంగా నిర్వహించారు . ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ముత్తుముల క్రిష్ణ కిశోర్ రెడ్డి పాల్గొన్నారు మండల క్లస్టర్ నాయకులు సాదర స్వాగతం పలికారు రాచెర్ల బస్ స్టాండ్ నుండి మహానాడు వేదిక వరకు భారీ ర్యాలీగా చేరుకుని జ్యోతి ప్రజ్వలన చేసి వందేమాతర గేయంతో కార్యక్రమం ప్రారంభించారు తదుపరి తెలుగుదేశం పార్టీ జెండా ఆవిష్కరణ చేసి ఎన్టీఆర్ చిత్రపటానికి పూల మాలతో ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం క్రిష్ణ కిశోర్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేద ప్రజలకు చేసిన సంక్షేమ పథకాలను ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి నియోజకవర్గ , రాచర్ల, మండలం అభివృద్ధి కోసం చేసిన కార్యక్రమాల అభివృద్ధి గురించి వివరించారు. చివరగా మహానాడు కార్యక్రమంలో పాల్గొన్న మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు స్వయంగా భోజనం వడ్డించి కార్యకర్తలతో కలిసి భోజనం చేశారు. అనంతరం మండల నాయకులు కార్యకర్తలు అభిమానులు క్రిష్ణ కిశోర్ రెడ్డి ని శాలువా పూల మాలతో ఘనంగా సన్మానించారు.

# కొమరోలు లో అట్టహాసంగా ప్రారంభమైన మహానాడు పసుపు పండుగ వేడుకలు

## తెలుగుదేశం జెండా ఎగురవేసి ,స్వర్గీయ ఎన్టీ రామారావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన టిడిపి ముఖ్య నాయకులు





**కొమరోలు పెన్ పవర్ మే 27**

తెలుగుదేశం పార్టీ మహానాడు పసుపు పండుగ వేడుకలు బుధవారం కొమరోలులో అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి .రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలు సూచనల మేరకు, గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి నాయకత్వంలో కొమరోలు లోని స్టేట్ బ్యాంక్ వీధిలోగల కొమరోలు సహకార సంఘం అధ్యక్షులు ముత్తుముల సంజీవరెడ్డి నివాస గృహ ప్రాంగణంలో మహానాడు పసుపు పండుగ వేడుకలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి .ఆ కార్యక్రమానికి కొమరోలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బొనేని వెంకటేశ్వర్లు యాదవ్ అధ్యక్షత వహించగా, గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి సోదరులు,, గిద్దలూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు ముత్తుముల కృష్ణ కిషోర్ రెడ్డి ,కొమరోలు సహకార సంఘం చైర్ పర్సన్ ముత్తుముల సంజీవరెడ్డి,, ఎడమ కళ్ళు సహకార సంఘం అధ్యక్షులు బిజ్జం రవీంద్రారెడ్డి ,గిద్దలూరు మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ గోడి ఓబుల్ రెడ్డి ,డైరెక్టర్లు షేక్ హసీనా, బిజ్జాల తిరుమలరెడ్డి తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఆ సందర్భంగా కొమరోలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు యాదవ్, ముత్తుముల సంజీవరెడ్డి తదితరులు తెలుగుదేశం పార్టీ జెండాను కార్యకర్తల హర్షధ్వనాల మధ్య ఆవిష్కరించారు. అనంతరం తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీ రామారావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పసుపు పండుగ వేడుక వేడుకలకు కొమరోలు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల నుంచి తెలుగుదేశం పార్టీ నేతలు కార్యకర్తలు క్లస్టర్ ఇన్చార్జీలు యూనిట్ ఇన్చార్జీలు తదితరులు అందరు హాజరు కావడంతో పాటు ఆ వీధిలో తెలుగుదేశం పార్టీ పసుపు జెండాలను అలంకరించడంతో వేదిక ప్రాంగణం పసుపు పచ్చదనంతో నిండి కలకలలాడింది.

హాజరైన నాయకులు ,కార్యకర్తలు అందరూ పసుపు చొక్కాలు ధరించి ,పసుపు కండువాలు వేసుకుని, మెడలో గుర్తింపు కార్డులు వేసుకొని కార్యక్రమానికి హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆ సందర్భంగా ముత్తుముల కృష్ణ కిషోర్ రెడ్డి ,బోనేని వెంకటేశ్వర యాదవ్ తెలుగు తెలుగుదేశం పార్టీ ఆవిర్భావానికి దారి తీసిన పరిస్థితులు, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు స్వర్గీయ ఎన్టీ రామారావు పార్టీని స్థాపించి పార్టీ అభివృద్ధికి చేసిన కృషి, అనంతరము పార్టీని అధికారంలోకి తెచ్చిన పరిస్థితులను కార్యకర్తలకు వివరించారు. ఎన్టీ రామారావు అడుగుజాడల్లో నేటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆయన తనయుడు లోకేష్ నాయుడు నడుస్తూ ఎన్టీ రామారావు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను కొనసాగిస్తూరాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ ప్రజాసంక్షేమానికి పెద్దపీట వేసి సూపర్ సిక్స్ హామీలను అమలుచేసి ప్రజా ఆదరణ పొందుతున్నారని వారు వివరించారు. గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి నాయకత్వంలో గిద్దలూరు నియోజకవర్గం మరి ఎంతో అభివృద్ధి పథంలో పయనిస్తుందని, అనునిత్యం ప్రజల సమస్యలు, వారి కష్టసుఖాలను తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి అశోక్ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఆ కార్యక్రమంలో కొమరోలు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలకు చెందిన నేతలు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు. పసుపు పండుగ తొలి రోజు వేడుకలు ఘనంగా ముగిశాయి.

# ముస్లిం సోదర, సోదరిమణులకు ఎమ్మెల్యే బక్రీద్ శుభాకాంక్షలు

### వైస్సార్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎమ్మెల్యే తాటిపర్తి

**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ మే 27**



కరుణ, త్యాగం, భక్తి విశ్వాసాలకు ప్రతీక అయిన బక్రీద్ పండుగను సంతోషంగా జరుపుకోవాలని, నియోజకవర్గం లోని ముస్లిం సోదరా సోదరిమణులకు వైస్సార్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎమ్మెల్యే తాటిపర్తి చంద్ర శేఖర్ బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. హాజరత్ ఇబ్రహీం త్యాగానిరతిని గుర్తు చేసుకుంటూ, పేదలకు దాన ధర్మాలు చేయాలనే గొప్ప ధ్యేయంతో జరుపుకునే గొప్ప పండుగ బక్రీద్ అని అన్నారు. అల్లా ఆశీస్సులు అందరిపై ఎల్లవేళలా ఉండాలని కోరుకుంటున్నానని అన్నారు.

# హనుమాన్ జంక్షన్ కుంటలో పసుపు పండుగ

### ఘనంగా మహానాడు మొదటి రోజు వేడుకలు...



**యర్రగొండపాలెం పెన్ పవర్, మే 27:**

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, స్వర్గీయ నందమూరి తారక రామారావు గారి జయంతి వేడుకలను యర్రగొండపాలెం నియోజకవర్గ పరిధిలో ఘనంగా నిర్వహించారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేష్, మరియు యర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్చార్జి గూడూరి ఎరిక్షన్ బాబుల సూచనల మేరకు.. క్లస్టర్-10 ఆధ్వర్యంలో తోకపల్లి పంచాయతీ కుంట (జంక్షన్) వద్ద మహానాడు మొదటి రోజు వేడుకలను అత్యంత వైభవంగా చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన తెలుగు ప్రజల ఆరాధ్య దైవం, అన్న నందమూరి తారక రామారావు గారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. సమాజంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం ఎన్టీఆర్ చేసిన సేవలను, తెలుగుజాతికి ఆయన అందించిన గౌరవాన్ని ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు.ఈ కార్యక్రమం లో క్లస్టర్ ఇంచార్జి జడ్డా రవి , ఞూాా=ణజ డైరెక్టర్ నక్కాశ్రీను , సొసైటీ చైర్మన్ వెన్నా బోడి రెడ్డి , యూనిట్ ఇన్చార్జులు దుగ్గంపూడి కొండారెడ్డి, యేరువ పాపిరెడ్డి , తోకల ఎల్లయ్య , దొడ్డ నాసర్ రెడ్డి , దుగ్గంపూడి చిన్న కొండారెడ్డి, ఐ టీడీపీ నాయకులు చేతుల నాగరాజు,దుగ్గంపూడి మల్లారెడ్డి , సొసైటీ డైరెక్టర్ గోదాపు సత్యం రెడ్డి , మాజీ సర్పంచ్ లింగాల అబ్రహం , మాజీ వీూజ వెంగల్ రెడ్డి , పత్తి శ్రీనివాసరావు , గుంటక యోగిరెడ్డి , గుంటక రమణారెడ్డి, ఉప్పలపాటి చిన్న శేషయ్య , డివి రెడ్డి, అశోక్ రెడ్డి, కాశీ రెడ్డి, దుద్దెల కోటి రెడ్డి,తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు..

# ఈవిఎంల వద్ద పటిష్టమైన భద్రత ఉండాలి -జిల్లా కలెక్టర్

**కలెక్టరేట్ పెన్ పవర్, ఒంగోలు మే 27**

జిల్లాకు సంబంధించి ఈవిఎంలను భద్రపరచిన గోడౌన్ వద్ద నిరంతరం పటిష్టమైన భద్రత ఉండాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి పి. రాజాబాబు, సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల కమీషన్ ఆదేశాలు, మార్గదర్శకాల మేరకు సాధారణ తనిఖీల్లో భాగంగా బుధవారం ఒంగోలు నగరంలోని మామిడిపాలెంలో గల ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు (ఇవిఎం) గోదాములను జిల్లా కలెక్టర్ తనిఖీ చేసి గోదాములకు వేసిన సీళ్లను పరిశీలించారు. అక్కడి భద్రతా ఏర్పాట్లపై సమీక్షించారు. జిల్లా కలెక్టర్ వెంట ఒంగోలు డిఆర్ఓ శ్రీధర్ రెడ్డి, కలెక్టరేట్ సూపరింటిండెంట్ శ్రీనివాస రావు, ఇతర రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# పొగాకు రైతులకు సంఘీభావం తెలిపిన వైకాపా నాయకులపై పెట్టిన అక్రమ కేసులను ఉపసంహరించు కోవాలి

### -వైకాపా ఇన్చార్జి, మాజీ శాసనసభ్యులు బుర్రా

**కందుకూరు పెన్ పవర్, మే 27:**

పొగాకు రైతులు గిట్టుబాటు ధర కోసం రోడ్డెక్కి సరైనధర లేక అలమటిస్తున్నామని, ఇప్పటికీ పెట్టుబడి కోసం తెచ్చిన అప్పుల భారంతో కృంగిపోతూ మద్దతు ధర లేక ఆందోళన చేస్తున్న పొగాకు రైతులకు సంఘీభావంగా బోర్డును సందర్శించి పొగాకు రైతుకు మేలు చేయాలని కోరిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులపై అక్రమ కేసులను బనాయించడం అత్యంత దుర్మార్గమైన చర్య దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని, తక్షణం రైతు ప్రతినిధులపై పెట్టిన తప్పుడు కేసులను ఉపసంహరించుకోవాలని నియోజకవర్గ ఇన్చార్జి,మాజీ శాసనసభ్యులు బుర్రా మధుసూదన్ యాదవ్ ఒక ప్రకటనలో కోరారు. రైతుల న్యాయమైన ఆందోళన పక్కదారి పట్టించాలని దురుద్దేశంతో రైతు నాయకుడు అని ముసుగులో ఉన్న అధికార పార్టీ నాయకుడిచేత తప్పుడు రిపోర్టు ఇప్పించి అక్రమంగాకేసులు బనాయించారు. పొగాకు బోర్డు వ్యవహారాలకు ఇతనికి ఉన్న సంబంధం ఏమిటని ప్రశ్నిస్తున్నాను. రైతుల పక్షాన నిలబడాల్సిన అధికార పార్టీ నాయకులే దొంగల ముసుగు తొడుక్కొని గిట్టుబాటు ధర రాకపోతే మా ప్రభుత్వానికి ఏమి సంబంధం అంటూ వ్యంగ్యంగా మాట్లాడుతున్నారు. పొగాకు రైతులు పెట్టిన పెట్టుబడులు కూడా చేతికి



రాక అప్పుల భారంతో జీవితాలు తారు మారవుతుంటే అధికార పార్టీ నాయకులు రైతుల పైన అబండాలు వేస్తూ అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ముమ్మాటికి ఇది రైతు వ్యతిరేక చర్య రైతు పచ్చగా ఉండాలని భావించిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుల పై పెట్టిన అక్రమ కేసులను తక్షణం ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. రైతు ప్రతినిధులపై పెట్టిన ఈ అక్రమ కేసులను ఎత్తివేయకపోతే అవసరమైతే న్యాయ పోరాటం చేస్తామని తెలిపారు.

# వేసవి విజ్ఞాన శిబిరంలో ఘనంగా నెహ్రూ, కందుకూరి వీరేశలింగం వర్ధంతి వేడుకలు

### నివాళులర్పించిన గ్రంథ పాలకుడు ఆళ్ల భాస్కర్ రావు

**సి ఎస్ పురం, పెన్ పవర్ మే 27**

మండల కేంద్రమైన సి.ఎస్.పురంలో శాఖ గ్రంథపాలకుడు ఆళ్ల భాస్కర్ రావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరానికి బుధవారం విద్యార్థినీ, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ మరియు సంఘసంస్కర్త స్వర్గీయ కందుకూరి వీరేశలింగం వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా గ్రంథపాలకుడు ఆళ్ల భాస్కర్ రావు మాట్లాడుతూ జవహర్ లాల్ నెహ్రూ దేశ అభివృద్ధికి చేసిన సేవలు, పిల్లల పట్ల ఆయనకు ఉన్న ప్రేమాభిమానాలను విద్యార్థులకు వివరించారు. అలాగే కందుకూరి వీరేశలింగం సమాజ సంస్కరణ కోసం చేసిన కృషి, మహిళా విద్యాభివృద్ధికి చేసిన సేవలను విద్యార్థులకు తెలియజేశారు.అనంతరం విద్యార్థులకు నీతి కథలు చదివించడం, ఇంగ్లీష్, లెక్కలు బోధించడం నిర్వహించారు. విద్యార్థుల్లో ఉత్సాహం పెంపొందించేందుకు పలు ఆటలు నిర్వహించి వారిని ప్రోత్సహించారు. కార్యక్రమం అనంతరం విద్యార్థులకు బిస్కెట్లు, చాక్లెట్లు పంపిణీ చేశారు.వేసవి విజ్ఞాన శిబిరంలో మొత్తం 18 మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొని ఆసక్తిగా కార్యక్రమాలను వీక్షించారు. విద్యార్థుల మేధో వికాసానికి ఇలాంటి శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకుడు ఆళ్ల భాస్కర్ రావు, బోధన సిబ్బంది భారతి, ఆయేషా, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



# సంక్షేమ పథకాలకు ఆద్యుడు ఎన్టీఆర్

- ఒంగోలు నియోజకవర్గంలో కోలాహలంగా తెలుగుదేశం పార్టీ మహానాడు-2026
- ప్రతి క్లస్టర్ పరిధిలో ఏర్పాటు చేసిన డిజిటల్ స్క్రీన్ల ద్వారా మహానాడును వీక్షించిన టీడీపీ శ్రేణులు
- తెలుగుదేశం పార్టీ పతాకాన్ని ఆవిష్కరించడంతో పాటు ఎన్టీఆర్ కు నివాళులర్పించిన ఎమ్మెల్యే దామచర్ల, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి , కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు మే 27**

సంక్షేమ పథకాల ఆవిర్భావానికి ఎన్టీఆర్ ఆద్యుడని, పేద ప్రజల హృదయాలను గెలుచుకున్న మహానేత అని, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, పేదల పక్షపాతి అని తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు సేవలను ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు కొనియాడారు. జాతీయ తెలుగుదేశం పార్టీ పిలుపుమేరకు హైబ్రిడ్ మహానాడు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు నేతృత్వంలో ఒంగోలు అసెంబ్లీ పరిధిలో కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా జనార్దన్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి పరుగులు పెడుతున్నాయని తెలిపారు. టిడిపికి అసలైన బలం కార్యకర్తలేనని, తరాలు మారినా పసుపు జెండా మారదని జనార్దన్ స్పష్టం చేశారు. పార్టీ కోసం కష్టపడుతున్న కార్యకర్తల రుణం ఎన్నటికీ తీర్చలేమని,



ఎన్ని ఇబ్బందులు వచ్చినా కార్యకర్తల వెంటే నిలబడే నాయకుడు చంద్రబాబు నాయుడేనని అన్నారు. ఏపీ అభివృద్ధికి దిక్సూచి చంద్రబాబు నాయుడేనని అన్నారు. అన్ని వర్గాల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. నవ్యాంధ్ర సృష్టికర్త చంద్రబాబేనని, కార్యకర్తల త్యాగాల వల్లే పార్టీ, ప్రభుత్వాల్లో పదవులు దక్కుతున్నాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో టీడీపీ కార్యకర్తలకు ఎలాంటి ఆపద వచ్చినా కుటుంబ సభ్యుల్లా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఒంగోలు నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వంలో కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి జరుగుతోందని తెలిపారు. కార్యక్రమంలో ముందుగా స్థానిక బండ్లమిట్టలో జరిగిన కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, కనిగిరి శాసనసభ్యులు ఒంగోలు పార్లమెంటు టిడిపి అధ్యక్షులు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి తో కలిసి ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు తెలుగుదేశం పార్టీ జెండాను ఆవిష్కరించి ఎన్టీఆర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమం లో పార్టీ పరిశీలుకులు శివ ప్రసాద్ , పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ సీతారామయ్య, నగర అధ్యక్షులు బండారు మదన్ , క్లస్టర్ ఇంచార్జిలు, డివిజన్ /గ్రామ కమిటీ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, రాష్ట్ర /జిల్లా /నియోజకవర్గ /నగర అనుబంధ కమిటీ సభ్యులు, పార్టీ ముఖ్య నాయకులు, మహిళా నాయకులు, ఐటీడీపీ సభ్యులు, ప్రజలకు పెద్ద ఏత్తున పాల్గొన్నడం జరిగినది.

# త్యాగానికి, సహనానికి ప్రతీకగా నిలిచే పండుగబక్రీద్

### సర్కిల్ ఇన్స్పెక్టర్. వినోద్ కుమార్




**పాములూరు, పెన్ పవర్, మే27**

త్యాగానికి, సహనానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగను శాంతి, సామరస్యాలు వెల్లివిరిసేలా భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని పాములూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ వినోద్ కుమార్ ఆకాంక్షిస్తూ ముస్లిం సోదర సోదరీమణు లందరికీ బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సీఐ వినోద్ కుమార్ మాట్లాడుతూ బక్రీద్ పండుగ వేడుకలు, కార్యక్రమాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సర్కిల్ పరిధిలో పోలీసు శాఖ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టిందని ఆయన తెలిపారు. ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా అన్ని మత పెద్దలు, శాంతి కమిటీ సభ్యులతో పోలీసు అధికారులు సమావేశాలు నిర్వహించి, ప్రార్థనలు మరియు ఇతర కార్యక్రమాలు ప్రశాంత వాతావరణంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సుఖశాంతులతో నిర్వహించుకోవాలని సీఐ వినోద్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

# ప్రతి ఇంటిపై పసుపు జెండా ఎగరాలి

### టీడీపీ నియోజకవర్గఇంచార్జి గూడూరి ఎరీక్షన్ బాబు



**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ మే 27**

తెలుగువారి ఆత్మ గౌరవం ఎలుగెత్తి చాటడానికి పుట్టింది తెలుగుదేశం పార్టీ అని, మహానాడు తెలుగుదేశం పార్టీ కుటుంభ సభ్యుల పండుగ అని టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి గూడూరి ఎరీక్షన్ బాబు అన్నారు.సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన క్లస్టర్ –2డిజిటల్ మహానాడు కార్యక్రమంలో గూడూరి ఎరీక్షన్ బాబు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్, నియోజకవర్గ పరిశీలకులు నాదెండ్ల బ్రహ్మం చౌదరి లు పాల్గొన్నారు. పార్టీ జెండాను ఆవిష్కరించి, ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రసంగాన్ని స్క్రీన్ పై వీక్షించారు. ఈ సందర్భంగా గూడూరి ఎరీక్షన్ బాబు మాట్లాడుతు తమ పార్టీ అధినేత ఆదేశాలను ప్రతి కార్యకర్తల, నాయకులు, పాటించాలని, ప్రతి క్లస్టర్ లో మహానాడును అందరు పాల్గొని విజయవంతం చేయాలని, ఐడి కార్డులతో సెల్ఫీ దిగి సోషల్ మీడియాలో షేర్ చేయాలన్నారు. మహానాడు పసుపు పండుగ స్పూర్తితో పార్టీ బలోపేతానికి మరింతగా కృషి చేయాలన్నారు. నియోజకవర్గపరిశీలకులు నాదెండ్ల బ్రహ్మం చౌదరి మాట్లాడుతు రాష్ట్ర వ్యాప్తంగా 1875క్లస్టర్ లలో మహానాడు నిర్వహించడం చరిత్రత్మాకమని, రాష్ట్ర అభివృద్ధి కోసం రాబోయే స్థానిక ఎన్నికలలో ప్రతి గ్రామాన పసుపు జెండా ఎగురావేయడం కోసం అరమరికలు వదిలి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు చిట్యాల వెంగళరెడ్డి,క్లస్టర్ ఇంచార్జి షేక్ మస్తాన్ వలి,పట్టణ అధ్యక్షులు మల్లికార్జున, కో క్లస్టర్ ఇంచార్జి మలిపెద్ది రామకృష్ణ, సీనియర్ నాయకులు కామేపల్లి వెంకటేశ్వర్లు, తోట మహేష్ నాయుడు, కొత్తమాసు సుబ్రహ్మణ్యం, ముస్లీమ్ మైనార్టీ నాయకులు, షేక్ ఇస్మాయిల్, షేక్ సత్తార్, తదితరులు పాల్గొన్నారు.

# మహానాడు పార్టీకి, కార్యకర్తలకు పండుగే..

### కార్యకర్తల ఆనందాన్ని పంచుకొని చిందేసిన ఎమ్మెల్యే ముత్తుముల

**గిద్దలూరు,పెన్ పవర్, మే 27**

తెలుగుదేశం పార్టీ మహానాడు వర్చువల్ సమావేశంలో భాగంగా గిద్దలూరు పట్టణం తిరుమల కన్వెన్షన్ లో గిద్దలూరు టౌన్ క్లస్టర్ సమావేశం బుధవారం జరిగింది. మంగళగిరి పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో సాగిన మహానాడు కార్యక్రమాన్ని గిద్దలూరు నియోజకవర్గ పరిధిలోని అన్ని క్లస్టర్ కేంద్రాల్లో ఎల్.ఇ.డి తెరల ద్వారా నాయకులు కార్యకర్తలు వీక్షించారు. గిద్దలూరులో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఏడాది జరిగే మహానాడు పార్టీకి ఉత్సవం లాంటిదని, కార్యకర్తల్లో జోష్ పెంచుతుందన్నారు. రెండేళ్లుగా కూటమి ప్రభుత్వం అభివృద్ధి-సంక్షేమం జోడెడ్ల సవారీగా హుషారెత్తిస్తూ పాలన సాగిస్తుందన్నారు. నాయకులు,కార్యకర్తలతో కలిసి చిందేసి ఆనందాన్ని పంచుకున్నారు.



# పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలి

### కేంద్ర పథకాలను ప్రజలకు అవగాహన కల్పించాలి

### బిజెపి జిల్లా అధ్యక్షులు పి వి కృష్ణారావు

**సి ఎస్ పురం, పెన్ పవర్ మే 27**

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో చేపట్టిన సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రజలకు అవగాహన కల్పించి బిజెపి బలోపేతమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని బిజెపి జిల్లా అధ్యక్షులు పి వి కృష్ణారావు అన్నారు కనిగిరి నియోజకవర్గ పర్యటనలో భాగంగా సి.ఎస్.పురం మండలానికి విచ్చేసిన సందర్భంగా నూతన బీజేపీ జిల్లా అధ్యక్షుడు పి.వి.కృష్ణారావు ను బీజేపీ నాయకులు, కార్యకర్తలు బుధవారం ఘన స్వాగతం పలుకుతూ గజమాల వేసి శాలువాలతో సత్కరించి ఘనంగా అభినందనలు తెలిపారు. అనంతరం కళ్యాణ మండపము నందు బిజెపి మండల ప్రధాన కార్యదర్శి ఇండ్ల దుర్గాప్రసాద్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో జిల్లా అధ్యక్షుడు పి. వి. కృష్ణారావు మాట్లాడుతూ భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తాందన్నారు. కేంద్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడి 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ నాయకులకు సూచించారు. ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో దేశం ఆర్థిక, పారిశ్రామిక, సాంకేతిక రంగాల్లో విశేష పురోగతి సాధించిందని తెలిపారు.కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గ్రామీణ ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నాయని



పేర్కొన్నారు. పేద, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఉజ్వల, పీఎం ఆవాస్, రైతు సంక్షేమ పథకాలు, మహిళా సాధికారత కార్యక్రమాలు ప్రజల జీవితాల్లో మార్పు తీసుకువచ్చాయని వివరించారు. భారతదేశాన్ని ప్రపంచ వేదికపై గౌరవప్రదమైన స్థానంలో నిలిపిన ఘనత ప్రధాని మోదీకే దక్కుతుందని కొనియాడారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీ నాయకులు సమన్వయంతో కార్యక్రమాలు నిర్వహించి ప్రతి గ్రామంలో పార్టీ బలోపేతానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు ప్రతి పోలింగ్ బూత్ స్థాయిలో బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించి, శక్తి



కేంద్రాలను ఏర్పాటు చేసి పార్టీని గ్రామస్థాయిలో మరింత పటిష్టం చేయాలని అన్నారు కార్యకర్తలే పార్టీకి వెన్నెముకలని , ప్రతి కార్యకర్త తమ వంతు బాధ్యతగా ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కారానికి కృషి చేసి పార్టీ బలోపేతం చేసి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని అన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సర్ కో కన్వీనర్ కొండిశెట్టి వెంకటరమణయ్య, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు నరాల శ్రీనివాసులు రెడ్డి, బిజెపి రాష్ట్ర మాజీ ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు మాదినేని లక్ష్మణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఇండ్ల వెంకట సత్యం, జాజం చిన్న సుబ్బయ్య, సీనియర్ నాయకులు పెద్దిరెడ్డి రమణారెడ్డి,లాకా నారాయణ, మాల్యాద్రి , పెద్దన్న, గొట్టిముక్కల నరసింహులు, సుబ్బయ్య బిజెపి కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# గుడ్లూరులో ఉత్సాహంగా ప్రారంభమైన మహానాడు

### భారీగా హాజరైన పార్టీ శ్రేణులు.

### మహానాడు ప్రాముఖ్యతను వివరించిన ఎమ్మెల్యే ఇంటూరి




**గుడ్లూరు, పెన్ పవర్, మే 27:**

మండల కేంద్రమైన గుడ్లూరులో వర్చువల్ గా నిర్వహించిన మహానాడు కార్యక్రమం బుధవారం ఉత్సాహంగా ప్రారంభం అయినది. మండలం పరిధిలో ఉన్న ఆయా గ్రామాల నుంచి పార్టీ శ్రేణులు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. స్థానికంగా సినిమాహల్ సెంటర్లో ఉన్న రెండు కళ్యాణ మండపాలు పూర్తి స్థాయిలో నిండిపోయాయి. డిజిటల్ స్క్రీన్ ల పై మహానాడు కార్యక్రమాన్ని పార్టీ స్థానిక నాయకులతో కలిసి కార్యకర్తలు, అభిమానులు వీక్షించారు. రెండు క్లస్టర్ లలో జరుగుతున్న మహానాడు కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు హాజరై, ప్రసంగించి, కార్యక్రమ ఉద్దేశ్యాని తెలియజేశారు. తొలుత ఎమ్మెల్యే ఇంటూరి తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు స్వర్గీయ ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఎమ్మెల్యేతో ఫోటోలు దిగేందుకు నాయకులు, అభిమానులు, ముఖ్యంగా మహిళలు ఎంతో ఉత్సాహం చూపారు. కార్యక్రమానికి వచ్చే ప్రతి ఒక్కరికీ ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా



చల్లని మంచినీరు, బోజన ఏర్పాట్లు చేశారు. మొదటి రోజు మహానాడు కార్యక్రమం తెలుగు తమ్ముళ్ళలో ఎంతో ఉత్సాహాన్ని నింపింది. ఈ కార్యక్రమంలో నాయకులు గుర్రం మాల్యాద్రి, మండల పార్టీ అధ్యక్షుడు జనిగర్ల నాగరాజు, గుడ్లూరు మాజీ సర్పంచ్ మేకపోతుల రాఘవులు, కాకుమాను మాధవరావు, రావూరి వేణు, పువ్వాడి వేణు, దామా వెంకటేశ్వర్లు, కాపులూరి మాల్యాద్రి, చెన్నారెడ్డి మహేష్, చిత్తారు మల్లికార్జున, కాపులూరి శ్రీను, కారసాల శ్రీనివాసులు, మండల పరిధిలోని గ్రామాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ముఖ్యంగా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# బక్రీద్ పర్వదినాన్ని సోదరభావంతో జరుపుకోవాలి- జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు

**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు మే 27**



మానవ జీవితంలో ఎదురయ్యే ఎన్నో కష్టాలు, సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొంటూ, దేవునిపై విశ్వాసాన్ని కలిగి సన్మార్గంలో నడవాలని బోధించే పవిత్రమైన పండుగ బక్రీద్ అని జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు పేర్కొన్నారు. తమకు ఉన్న దాంట్లో కొంత భాగాన్ని ఇతరులకు పంచిపెట్టే దాతృత్వ భావనను పెంపొందిస్తూ, త్యాగం, ప్రేమ, సత్యానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా ఎస్పీ సూచించారు. బక్రీద్ పండుగ వేడుకలు, కార్యక్రమాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జిల్లా వ్యాప్తంగా పోలీసు శాఖ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టిందని తెలిపారు. ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా అన్ని మత పెద్దలు, శాంతి కమిటీ సభ్యులతో పోలీసు అధికారులు సమావేశాలు నిర్వహించి, ప్రార్థనలు ఇతర కార్యక్రమాలు ప్రశాంత వాతావరణంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సుఖశాంతులతో నిర్వహించుకోవాలని విజ్ఞప్తి చేశారు. త్యాగానికి, సహనానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగను శాంతి, సామరస్యాలు వెల్లివిరిసేలా భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ ప్రకాశం, మార్కాపురం జిల్లాలలోని ముస్లిం సోదర సోదరీమణులందరికీ ఎస్పీ బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

# భారీ ఎల్ఈడి స్క్రీన్ ఏర్పాటుచేసి మహానాడును వీక్షించిన పార్టీ శ్రేణులు -సీనియర్ నాయకులకు సన్మానం





**సి ఎస్ పురం, పెన్ పవర్ మే 27**

మండల కేంద్రంలోని సి. ఎస్. పురం టిడిపి కార్యాలయ ఆవరణలో బుధవారం మహానాడు కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. మండల టిడిపి అధ్యక్షులు బొబ్బూరి రమేష్ అధ్యక్షతన భారీ ఎల్ డి స్క్రీన్ ఏర్పాటు చేసి మహానాడు ప్రత్యక్ష ప్రసారాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. పార్టీ ఐడి కార్డులతో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం "జోహార్ ఎన్టీఆర్" అంటూ నినాదాలు చేస్తూ టిడిపి వ్యవస్థాపకుడు మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ పార్టీ సీనియర్ నాయకులు నాగిశెట్టి చిన్న మాలకొండయ్య, పాములపాటి నరసయ్య, దేరంగుల తిరుపతయ్య, షేక్ అబ్దుల్లా, చావా చంద్రశేఖర్, గల్లా చెన్నయ్య, దాసరి మల్లికార్జున లను శాలువా తో సత్కరించి అభినందించారు ఈ కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో అధ్యక్షులు బోయళ్ల నారాయణరెడ్డి పాల్గొని పార్టీ శ్రేణులను ఉత్సాహపరిచారు.అనంతరం ఏర్పాటు చేసిన భారీ ఎల్ఈడి స్క్రీన్ పై మహానాడు ప్రత్యక్ష ప్రసారాన్ని టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆసక్తిగా వీక్షించారు. ఈ సందర్భంగా పలువురు టిడిపి నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మరియు పలువురు రాష్ట్ర నాయకులు మహానాడులో ఇచ్చిన సూచనలు, ఆదేశాలను పార్టీ బలోపేతానికి కృషి చేయాలని అన్నారు మహానాడు పసుపు పండగ స్ఫూర్తితో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి ప్రతి కార్యకర్త సమిష్టిగా కృషి చేయాలని సూచించారు ఈ కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో అధ్యక్షులు బోయళ్ల నారాయణరెడ్డి, మాజీ మండల టిడిపి ప్రధాన కార్యదర్శి మన్నేపల్లి శ్రీనివాసులు, క్లస్టర్ ఇంచార్జి షేక్ రజ్జబ్ భాష, పట్టణ టిడిపి అధ్యక్షులు బత్తుల వెంకటాద్రి, మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు కూటగుళ్ల మహబూబ్ బాషా, మన్నేపల్లి మహేంద్ర, కోవిలంపాడు గ్రామ పార్టీ అధ్యక్షులు అమడసాని బాలకేశవరెడ్డి, నీటి సంఘం అధ్యక్షులు దొనపాటి మోహన్ రెడ్డి, రావుల సూరి, చందలూరి బాల కాశయ్య, వల్లపు శెట్టి వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# నేర రహిత సింగరాయకొండలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

### ప్రజలకు ఎస్సై పిలుపు



**సింగరాయకొండ, మే 27, పెన్ పవర్**

వేసవి లో గ్రామాలలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నేర రహిత సింగరాయకొండ గా తీర్చి దిద్దేందుకు ప్రజల భాగస్వామ్యం సహకారం ఉండాలని ఎస్సై పిలుపు ఇచ్చారు. బుధవారం ఆయన సింగరాయకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో పలు ప్రాంతాల్లో పర్యటించి ప్రజలకు నేరాల నియంత్రణ నివారణ పోలీస్ కి సహకారం పై అవగాహన కల్పించాలని ఆయన కోరారు. వేసవి కాలం కావడం తో ప్రజలు గ్రామాలలో ఆరుబయట, మిద్దెల మీద నిద్రిస్తుంటారని అలాంటి ప్రాంతాలను టార్గెట్ చేసి నేరగాళ్లు నేరాలకు పాల్పడిస్తారని ఆయన ప్రజలకు గుర్తు చేశారు. పగటి, రాత్రి దొంగ తనాల పై అప్రమత్తంగా ఉండాలని ఇళ్ళకి సరైన తాళాలు వేసుకోవాలని నివాస ప్రాంతాల్లో కొత్త వ్యక్తుల కదలికలు గుర్తిస్తే వెంటనే ఆసమాచారం పోలీస్ కి చేరవేసి దొంగతనాల నియంత్రణకు సహకరించాలని ఎస్సై పిలుపు ఇచ్చారు. చెడు నడత గల వారి కదలికలు, మాదక ద్రవ్యాలు అక్రమ నిల్వాలు, చెలామణి, అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీస్ సేవలు పొందాలని ఎస్సై సుధీర్ కుమార్ ప్రజలను కోరారు. ఎస్సై వెంట సింగరాయకొండ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# పారిశుధ్ధ్య నిర్వహణలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి

## - జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు





**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు మే 27**

గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్ధ్య నిర్వహణ పటిష్టంగా నిర్వహించడం లో పంచాయతీ రాజ్ శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ శ్రీ పి. రాజాబాబు, పేర్కొన్నారు. బుధవారం ఒంగోలు నగరంలోని ఎస్జివిఎస్ ఫంక్షన్ హాల్లో ప్రకాశం, మార్కాపురం, బాపట్ల జిల్లాలకు చెందిన పంచాయతీ రాజ్ శాఖ అధికారులకు నిర్వహించిన ఘన వ్యర్థాల నిర్వహణ నియమాల అమలు, గ్రామ పంచాయతీలలో ఘన వ్యర్థాల శుద్ధి కేంద్రాల కార్యాచరణ పై పంచాయతీ రాజ్ శాఖ అధికారులకు నిర్వహించిన వర్క్‌షాప్ లో జిల్లా కలెక్టర్ రాజాబాబు పాల్గొని ప్రసంగిస్తూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని క్లీన్ ఆంధ్రప్రదేశ్ గా మార్చాలన్న లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అనేక కార్యక్రమాలను అమలు చేయడం జరుగుచున్నదన్నారు. పరిసరాలను శుభ్రంగా పెట్టుకోవడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, తద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు అన్నీ వర్గాల ప్రజలను భాగస్వాములు చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు ‘ స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర ‘ కార్యక్రమాన్ని 17 నెలలుగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పరిసరాలను పరిశుభ్రంగా పెట్టుకోవడం ద్వారా ఆరోగ్యంతో పాటు గౌరవం కూడా పెరుగుతుందని కలెక్టర్ తెలిపారు. మీరు ప్రాతినిధ్యం వహిస్తున్న గ్రామం లేదా మండలాన్ని పరిశుభ్రం గా ఉంచడం ద్వారా ఆ గ్రామానికి లేదా మండలానికి గౌరవం పెరిగేలా అధికారులు ప్రత్యేక శ్రద్ద చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరం అయినప్పటికీనీ ఇంకా కొన్ని ప్రాంతాల్లో స్వచ్ఛత గురించి మాట్లాడుతున్నామంటే ఎక్కడో మనలో స్వచ్ఛత పై నిర్లక్ష్యం అనేది ఉందన్నారు. జల సురక్ష మిషన్ కార్యక్రమం ద్వారా ప్రజలకు సురక్షిత తాగునీటిని అందించాలన్న లక్ష్యంతో జిల్లా లోని అన్నీ గ్రామ పంచాయతీ లలో నీటి ట్యాంకు లను శుభ్రం చేయడం, బోర్లుకు మరమత్తులు చేపట్టడం, ఎప్పటికప్పుడు నీటి ని సాంపిల్స్ తీయడం వంటి కార్యక్రమాలు చేపట్టడం జరుగుచున్నప్పటికినీ, చాలా మంది ప్రజలు బబుల్ వాటర్ తాగడం జరుగుచున్నదన్నారు. వాటిలో మినరల్స్ తక్కువ శాతం ఉంటుందని, ప్రభుత్వం అందిస్తున్న వాటర్ లో మినరల్స్ శాతం ఎక్కువగా ఉంటుందన్న విషయాన్ని ప్రజలకు తెలియచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ రోజు నిర్వహిస్తున్న వర్క్ షాప్ లో ఘన వ్యర్థాల నిర్వహణ నియమాల అమలు, గ్రామ పంచాయతీలలో ఘన వ్యర్థాల శుద్ధి కేంద్రాల నిర్వహణ పై తెలియచేసే అంశాలను, విషయాలను క్షుణ్ణంగా అవగాహన చేసుకొని గ్రామీణ ప్రాంతాలను పరిశుభ్రం ఉంచేలా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. స్వచ్ఛ కార్యక్రమాల్లో ప్రజలను కూడా భాగస్వాములు చేస్తూ వారిలో స్వచ్ఛత అనేది ఆరోగ్య అలవాటుగా మార్చే లక్ష్యంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్ధ్య నిర్వహణ పటిష్టంగా నిర్వహించడం లో పంచాయతీ రాజ్ శాఖ అధికారులు బాధ్యతతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ వర్క్ షాప్ లో పంచాయతీ రాజ్ శాఖ అడిషనల్ కమీషనర్ యం. సుధాకర్ రావు, జడ్పి సిఈఓ

చిరంజీవి, డిపిఓ వెంకటేశ్వర రావు, ప్రకాశం, మార్కాపురం, బాపట్ల జిల్లాల డిఎల్డిఓ లు, ఎంపిడిఓ లు, డిప్యూటీ ఎంపిడిఓ లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# పొదిలిలో అట్టహాసంగా జరిగిన మహానాడు



**పొదిలి, పెన్ పవర్, మే 27**

పొదిలిలో జరిగిన వర్చువల్ మహానాడు కార్యక్రమం ఎంతో అట్టహాసంగా జరిగింది. స్థానిక మంజునాథ కళ్యాణ మండపంలో జరిగిన మహానాడు కార్యక్రమం పండుగ వాతావరణం లో జరిగింది. ఈ కార్యక్రమానికి ఒంగోలు నియోజకవర్గ పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసరెడ్డి, కనిగిరి నియోజకవర్గం శాసనసభ్యులు ఉగ్ర నరసింహారెడ్డి లు పాల్గొని కార్యకర్తల్లో మరింత ఉత్సాహాన్ని రేకెత్తించారు. అలాగే తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారక రామారావు చిత్రపటానికి వారు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు తెలుగుదేశం నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధిని వివరించారు. కార్యక్రమానికి మార్కాపురం శాసనసభ్యులు నారాయణరెడ్డి సోదరులు కందుల రామిరెడ్డి ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పొదిలి ఏఎంసి చైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమాంస, తెలుగుదేశం నాయకులు మీగడ ఓబుల్ రెడ్డి, ముల్లా కుద్దూస్, దేశం పార్టీ మైనారిటీ నాయకులు షేక్ రసూల్ మహమ్మద్, ఎస్. యాసిన్, మండల తెలుగు యువత అధ్యక్షులు పి. నరేష్, ఎండి గౌస్, ఎస్ అల్లా బకాష్, మహిళా నాయకురాలు ఎస్. మెహర్ ఉన్నిసా, ఎస్. షహనాజ్ బేగం తదితరులు పాల్గొన్నారు.


# మాజీ సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డిని కలిసిన పిడతల ప్రవీణ్ కుమార్ రెడ్డి



**గిద్దలూరు పెన్ పవర్ మే 27**

ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ని గిద్దలూరు వైసీపీ నాయకులు ఏపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ పిడతల ప్రవీణ్ కుమార్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.తాడేపల్లి లోని క్యాంప్ కార్యాలయంలో మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి ని కలిశారు. ఈ సందర్భంగా గిద్దలూరు నియోజకవర్గ రాజకీయ పరిస్థితులపై మాజీ సీఎం ప్రవీణ్ కుమార్ రెడ్డి ని ఆరా తీశారు.తర్వాత కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ పార్టీ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొనాలని అలానే పార్టీని బలోపేతం చేస్తూ ముందుకు వెళ్లాలని ప్రవీణ్ కుమార్ రెడ్డి కి వైయస్ జగన్ మోహన్ రెడ్డి దిశా నిర్దేశం చేశారు.

# మాదకద్రవ్య రహిత ప్రకాశం జిల్లా ఆవిష్కరణే లక్ష్యం - జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు






**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు మే 27**

మాదకద్రవ్య రహిత ప్రకాశం జిల్లా ఆవిష్కరణే లక్ష్యంగా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు స్పష్టం చేశారు. ఈ దిశగా సంబంధిత అధికారులతో బుధవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యేక సమావేశం ( ఎన్ కార్డ్ కమిటీ ) నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గుర్తించిన 20 హాట్ స్పాట్ లలో విజిబుల్ పోలీసింగ్ ఉండాలన్నారు. ఎక్సైజ్, పోలీస్ అధికారులు ఈ ప్రాంతాలపై మరింత దృష్టి సారించాలని ఆయన చెప్పారు. మాధక ద్రవ్యాల వినియోగం వలన కలిగే దుష్ప్రభావాల గురించి విద్యార్థులకు విస్తృత అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. రెగ్యులర్ పాఠ్యాంశాలతో పాటు ఈ విషయాలను కూడా విద్యార్థులకు బోధించాలని చెప్పారు. ట్రెమడాల్, ఆల్ప్రజోలం మందులను వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా విక్రయించే ఔషధ దుకాణాల లైసెన్సులను తక్షణమే రద్దు చేయాలన్నారు. మాదకద్రవ్యాలకు అలవాటు పడినవారిని దాని నుంచి విముక్తి కల్పించడంలో డీఎడిక్షన్ సెంటర్, డ్రగ్స్ నియంత్రణ విభాగ అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. కాగా, గంజాయి కేసుల నమోదు, అక్రమ తరలింపును అడ్డుకొని సీజ్ చేసిన వివరాలను జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆయేషా బేగం, పోలీసు శాఖ పరంగా తీసుకుంటున్న చర్యలను ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు ఈ సందర్భంగా కలెక్టరుకు వివరించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ శ్రీధర్ రెడ్డి, సబ్ కలెక్టర్ హిమవంశీ, ఆర్డీవోలు, డీఎస్పీలు, డిఎంహెచ్వో వెంకటేశ్వర్లు, డ్రగ్స్ ఇన్స్పెక్టర్ ఉషారాణి, ఆర్.ఐ.ఓ. ఆంజనేయులు, డీఈవో రేణుక, గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్, మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు వరలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

# తెలుగుదేశం పార్టీ జీవనది లాంటిది

## టీడీపీలో కార్యకర్తే అధినేత





**పామూరు, పెన్ పవర్, మే27**

తెలుగుదేశం పార్టీ జీవనది లాంటిది, టీడీపీలో కార్యకర్తే అధినేత, కార్యకర్తలే పార్టీకి నిజమైన బలమని వారు స్పష్టం చేశారు. పామూరు పట్టణంలో క్లస్టర్ 11 పరిధిలో మహానాడు ప్రధాన వేదిక కార్యక్రమాన్ని స్థానిక శేష్ మహల్ థియేటర్ లో స్క్రీన్ మీద కార్యకర్తలకు ప్రత్యక్ష ప్రసారం చేశారు. మహానాడు వేడుకల సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించిన టిడిపి మహిళా నేతలు. ఈ సందర్భంగా షేక్ లూనా జబీన్, మద్దిశెట్టి రమాదేవి, కొంజేటి సుభాషిని, పాడే నాగమణి, షేక్ షాహీరా మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి కేవలం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని వారు పేర్కొన్నారు. దార్శనికుడైన సీఎం నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం సమగ్రాభివృద్ధి దిశగా పయనిస్తోందన్నారు. అన్న ఎన్టీఆర్ ఆశయాల సాధనే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. మహిళా సాధికారతకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, మహిళా సంక్షేమ పథకాలు విజయవంతంగా అమలు చేస్తున్నామన్నారు. డిజిటల్ విప్లవంతో నూతన సాంకేతికతను అందిపుచ్చుకొని పాలనలో పారదర్శకత తెస్తున్నామని వారు తెలిపారు. వర్చువల్ మహానాడు నిర్వహణతో సమయం, ఇంధనం ఆదా అవుతుందని, ఖర్చు కూడా తగ్గిందని వారు వివరించారు. మై టీడీపీ యాప్ ద్వారా పార్టీ కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాల సమాచారం క్షణాల్లో కార్యకర్తలకు చేరుతోందన్నారు. టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో పార్టీలో నూతనోత్సాహం వచ్చిందని డా. ఉగ్ర కొనియాడారు. యువతను రాజకీయాల్లో ప్రోత్సహిస్తూ లోకేష్ బాబు పార్టీకి నూతన జవసత్వాలు నింపుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో రైతు, పేద, బడుగు, బలహీన వర్గాలకు న్యాయం చేశామని వివరించారు. పెన్షన్ల పెంపు, సూపర్ సిక్స్ హామీల అమలుపై ప్రజల్లో సంతృప్తి ఉందన్నారు.

# నారాయణస్వామిని దర్శించుకున్న బిజెపి జిల్లా అధ్యక్షుడు పి.వి.కృష్ణారావు




**సి ఎస్ పురం, పెన్ పవర్ మే 26**

జిల్లాలోని ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పి.వి.కృష్ణారావు బుధవారం సందర్శించి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు మంకాల శివప్రసాద్ శర్మ గోత్రనామాలతో వేదమంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం దేవస్థానం తరఫున శేష వస్త్రాలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందించారు.ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు పి.వి.కృష్ణారావు మాట్లాడుతూ భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం 12 సంవత్సరాల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా ముందుకెళుతుందని. దేశ ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు ప్రధాని నరేంద్ర మోదీ దేశానికి మరిన్ని సేవలు అందించాలని, ఆయనకు ఆయురారోగ్యాలు కలగాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సర్ కో కన్వీనర్ కొండిశెట్టి వెంకటరమణయ్య, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు నరాల శ్రీనివాసులు రెడ్డి, రాష్ట్ర బిజెపి మాజీ ఓబీసీ కార్యవర్గ సభ్యులు మాదినేని లక్ష్మణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఇండ్ల వెంకట సత్యం, బిజెపి సీనియర్ నాయకులు పెద్దిరెడ్డి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భైరవకోనలో మహానాడు సందడి

## ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించిన యార్వ రమా శ్రీనివాసులు బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు




**సి ఎస్ పురం, పెన్ పవర్ మే 27**

మండలంలోని భైరవకోనలో గురువారం టిడిపి మహానాడును పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. టిడిపి నాయకులు భారీ ఎస్ఈడి స్క్రీన్ ఏర్పాటు చేసి మహానాడు ప్రత్యక్ష ప్రసారాన్ని ఐడెంటి కార్డులు ప్రదర్శిస్తూ ఉత్సాహంగా వీక్షించారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి సభ్యులు డాక్టర్ బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు, కనిగిరి ఏఎంసీ చైర్మన్ యార్వ రమా శ్రీనివాసులు హాజరై పార్టీ శ్రేణులను ఉత్సాహపరిచారు.కార్యక్రమం ప్రారంభంలో పార్టీ జెండాను ఆవిష్కరించి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం “జోహార్ ఎన్టీఆర్” అంటూ నినాదాలు చేస్తూ టిడిపి వ్యవస్థాపకుడు మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన భారీ ఎస్ఈడి స్క్రీన్ పై మహానాడు ప్రత్యక్ష ప్రసారాన్ని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆసక్తిగా వీక్షించారు.ఈ సందర్భంగా పలువురు టిడిపి నాయకులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. మహానాడు స్ఫూర్తితో ప్రతి కార్యకర్త పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి సభ్యులు డాక్టర్ బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా ఆవిర్భవించిందన్నారు. పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాజకీయాల్లోకి వచ్చి పేద ప్రజల కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారని కొనియాడారు. టిడిపి కార్యకర్తలు పార్టీ సిద్ధాంతాలను గ్రామస్థాయిలో ప్రజలకు తెలియజేస్తూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జి కోనంగి వెంకటకొండయ్య, సింగిల్ విండో చైర్మన్ చెరుకుపల్లి వెంకటరెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు వెంకట్రామరాజు, డి ఆదినారాయణ, నన్నసాని వరలక్ష్మయ్య టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.



## వైయస్ జగన్‌ని మర్యాదపూర్వకంగా కలిసిన దద్దాల



పామూరు, పెన్ పవర్,మే27

వైయస్ఆర్‌సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్య మంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ని తాడేపల్లిలోని వైయస్ఆర్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం కనిగిరి నియోజకవర్గం వైయస్ఆర్‌సీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో నిర్వహిస్తున్న పార్టీ కార్యక్రమాలు మరియు పార్టీ బలోపేతానికి అత్యంత కీలకమైన సంస్థాగత నిర్మాణాన కమిటీల డిజిటలైజేషన్ మరియు వెరిఫికేషన్ ప్రక్రియ, ఎస్ ఐ ఆర్ పై బి ఎల్ ఏ ల జాబితా వంటి పలు కీలక అంశాలను వైయస్ జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లానని దద్దాల పేర్కొన్నారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నియోజకవర్గంలో చేపడుతున్న పార్టీ కార్యక్రమాలు, మరియు కష్టకాలంలో పార్టీ నాయకులకు, కార్యకర్తలకు అండగా నిలుబడుతున్న తీరుకుగాను దద్దాల నారాయణ యాదవ్ ను అభినందించి, అండగా ఉంటానని భరోసా కల్పించినట్లు దద్దాల తెలిపారు. అదేవిదంగా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు ఇప్పటి నుండే ప్రణాళికలు రూపొందించాలని, ఎన్నికలలో నిలబడే పార్టీ అభ్యర్థుకు, కార్యకర్తలకు, నాయకులకు తోడుగా నిలబడాలని వైయస్ జగన్ మోహన్ రెడ్డి సూచించినట్లు దద్దాల నారాయణ యాదవ్ తెలిపారు.

## ముస్లిం సోదర సోదరీమణులందరికీ బక్రీద్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపిన దద్దాల

పామూరు, పెన్ పవర్, మే 27



వైఎస్సార్సీపీ కనిగిరి నియోజకవర్గం ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ బుధవారం ఒక ప్రకటనలో కనిగిరి నియోజకవర్గ ముస్లిం సోదర, సోదరీమణు లందరికీ హృదయ పూర్వక బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బక్రీద్ (ఈద్–ఉల్–అధా) చాలా పవిత్రమైన పండగని, మత సామరస్యానికి ప్రతీక అని, త్యాగానికి ప్రతి రూపంగా నిలిచే ఈ పండుగ రోజున సమస్త మానవాళికి శాంతి చేకూరాలని అల్లాని ప్రార్థిస్తూ మత సామరస్యాన్ని ప్రతిభింభించేలా బక్రీద్ పండుగను భక్తి శ్రద్దలతో జరుపుకోవాలని కోరుకుంటూ ముస్లిం సోదర సోదరీమణులందరికీ బక్రీద్ పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ పవిత్రమైన పండుగ మీ జీవితంలోకి త్యాగం, సహనం, శాంతి మరియు సంతోషాలను తీసుకురావాలని, అల్లాహ్ అనుగ్రహం ఎల్లప్పుడూ మీపై ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకున్నట్లు దద్దాల నారాయణ యాదవ్ తెలిపారు.

## త్యాగానికి, నిజాయితీకి ప్రతీకగా నిలిచే పండుగ

బక్రీద్. వై వి. సాయి కిరణ్

పామూరు, పెన్ పవర్, మే27



మానవ జీవితంలో ఎదురయ్యే ఎన్నో కష్టాలు, సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొంటూ, దేవునిపై విశ్వాసాన్ని కలిగి సన్మార్గంలో నడవాలని బోధించే పవిత్రమైన పండుగ బక్రీద్ అని ప్రముఖ వ్యాపారవేత, మాజీ ఉపసర్పంచ్ వై వి. సాయి కిరణ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వైవి. సాయి కిరణ్ మాట్లాడుతూ తమకు ఉన్న దాంట్లో కొంత భాగాన్ని ఇతరులకు పంచిపెట్టే దాతృత్వ భావనను పెంపొందిస్తూ, త్యాగం, ప్రేమ, సత్యానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండగను ప్రశాంత వాతావరణంలో పర్వదినాన్ని సుఖశాంతులతో, సోదరభావంతో జరుపుకోవాలని ముస్లిం సోదర సోదరీమణులందరికీ బక్రీద్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు.

# కొమరోలు లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన మార్కాపురం జిల్లా కలెక్టర్ విజయ సునీత, జెసి శ్రీనివాసులు

### పీహెచ్సీల తనిఖీల్లో భాగంగా కొమరోలు లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్. జాయింట్ కలెక్టర్

కొమరోలు పెన్ పవర్ మే 27

మార్కాపురం జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు బుధవారం కొమరోలు లోని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. రాష్ట్ర వైద్యారోగ్య శాఖ అనంతపురం జిల్లా కాండ్రిగ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రవేశపెట్టిన ఈ సంజీవిని ప్రాజెక్టు విజయవంతమైందని అందువల్ల సదరు ఈ సంజీవిని సంజీవిని ప్రాజెక్టును మార్కాపురం జిల్లాలో కూడా ప్రవేశపెట్టి విజయవంతంగా నిర్వహించేందుకు వీలుగా జిల్లా కలెక్టర్ మార్కాపురం జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి తనిఖీ చేస్తున్నారు .అందులో భాగంగా బుధవారం సాయంత్రం కొమరోలు లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వారు ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు ఈ సంజీవిని ప్రాజెక్ట్ అమలుకు అవసరమైన స్థలాన్ని, సౌకర్యాల గురించి ఆమె వైద్యాధికారిని శాంతితో చర్చించారు.ఆ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు అందుతున్న సేవలు, సగటున రోజుకు హాజరయ్యే రోగుల సంఖ్య ,సిబ్బంది పనితీరు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గల సౌకర్యాలు తదితర వాటిని పరిశీలించి సంతృప్తి చేశారు .ఆ సందర్భంగా జిల్లా కలెక్టర్ విజయ సునీత కొమరోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య అధికారిని వి శాంతితో పలు అంశాలపై చర్చించి తగు సూచనలు సలహాలు ఇచ్చారు. , వైద్య ఆరోగ్య శాఖ త్వరలో ప్రవేశపెట్టనున్న ఈ సంజీవిని కార్యక్రమం విజయవంతం అవుటకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.జిల్లా కలెక్టర్, జాయింట్



కలెక్టర్ రాకను గమనించిన తెలుగుదేశం పార్టీ నాయకులు, స్థానికులు పెద్ద సంఖ్యలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చేరుకొన్నారు. ఆ సందర్భంగా కొమరోలు సహకార సంఘం అధ్యక్షులు ముత్తుముల సంజీవరెడ్డి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు యాదవ్ తదితరులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వస్తున్న రోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో



ఇద్దరు డాక్టర్లు పనిచేయవలసి ఉండగా , ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రెండవ డాక్టర్ గా పనిచేస్తున్న చంద్రశేఖర్ కు పదోన్నతి కల్పించి జిల్లా కేంద్రానికి పంపించారని, ఆయన స్థానంలో మరొక డాక్టర్ ను నియమించలేదని, దీనితో గత కొంతకాలంగా ఒక డాక్టరు మాత్రమే పనిచేస్తున్నారని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఖాళీలను భర్తీ చేయాలని, ఆసుపత్రిలో ఎక్రే ప్లాంట్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని వివరించారు.కొమరోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వంద పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలని కోరారు.

# పసుపు పండుగ.. వీధులన్నీ పసుపుమయం

### నియోజకవర్గంలో పండుగలా మహానాడు ఉత్సవాలు

### హోరెత్తిన జై టీడీపీ నినాదాలు.. తెలుగు తమ్ముళ్లలో నూతన జోష్

### డిసెంబర్ నాటికి వెలిగొండను పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం: ఎమ్మెల్యే కందుల





మార్కాపురం పెన్ పవర్ మే27

నియోజకవర్గమంతా నభూతో నభవిష్యతి అన్నట్లుగా పసుపుమయంగా మారిపోయింది.వీధులన్నీ పసుపు తోరణాలు, జెండాలు, ఫ్లెక్సీలతో నిండిపోయి ఒక అద్భుతమైన పసుపు పండుగను తలపించింది. దరిమడుగు గ్రామంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిపార్టీ జెండాను ఆవిష్కరించి, స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి మహానాడు వేడుకలను అత్యంత వైభవంగా ప్రారంభించారు. జై టీడీపీ, జైజై టీడీపీ నినాదాలతో పురవీధులు మారుమోగుతుండగా, తెలుగు తమ్ముళ్లలో నూతన జోష్ ఉట్టిపడింది. నియోజకవర్గంలోని 11 క్లస్టర్ల పరిధిలో విడివిడిగా మహానాడును నిర్వహించారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి రూరల్ మండలంలోని క్లస్టర్–1, క్లస్టర్–5 లలో, పట్టణంలోని క్లస్టర్–2, క్లస్టర్ –3, క్లస్టర్–4 తర్లుపాడు మండలంలోని , క్లస్టర్ –6, క్లస్టర్ –7 లలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జాతీయ పార్టీ అధ్యక్షులు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేస్తానని చెప్పడం ఆయన చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు. ఇచ్చిన ప్రతి మాటకు కట్టుబడి సంక్షేమం అభివృద్ధిలో కలయికతో ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. గతంలో వైసిపి పాలకులు వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేశామని చెప్పి ఆ ప్రాజెక్టును ప్రారంభించి వెళ్లిపోయారని ఇప్పటికీ ఆ ప్రాజెక్టు పూర్తికి 2500 కోట్లు అవసరమని చిత్తశుద్ధితో పనిచేసి ఈ డిసెంబర్ నాటికి ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం ఇస్తామని అన్నారు.ఇప్పటికే మార్కాపురం జిల్లా ఇచ్చామని, త్వరలోనే ప్రభుత్వ మెడికల్ కాలేజీని టెండర్లు పిలిచి పూర్తి చేస్తామని అన్నారు. ఈ ప్రాంతాన్ని హార్టికల్చర్ హబ్ గా తీర్చిదిద్ది ఈ ప్రాంతాన్ని అన్ని రకాలుగా సస్యశ్యామలశీ చేస్తామని తెలిపారు.వెలుగొండ ప్రాజెక్టు పూర్తయితే ఈ ప్రాంతంలో మరిన్ని పరిశ్రమలు వస్తాయని ఇప్పటికే మూడు వేల కోట్ల`రూపాయలతో కొనకనమిట్ల రిలయన్స్ బయో గ్యాస్ ప్లాంట్ నిర్మాణం చేపడుతున్నామని ఈ ప్రాంతాన్ని పారిశ్రామికంగా కూడా అభివృద్ధి చేస్తామని అన్నారు.పార్టీలో ఏమన్నా చిన్న సమస్యలు ఉంటే అంతర్గతంగా చర్చించుకుందాం అని వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అందరం కష్టపడి అద్భుత గెలుపు సాధించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.ఈ వర్చువల్ మహానాడు కార్యక్రమంలో ఆయా క్లస్టర్ల పరిధిలోని తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.

# అధిక ఉష్ణోగ్రత వలన ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### – విద్యుత్ ఒంగోలు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మాకినేని హరిబాబు

స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు మే 27



ఒంగోలు పరిసర ప్రాంతాల్లో 45 డిగ్రీల సెల్సియస్ గా నమోదవుతున్న ఉష్ణోగ్రతల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, విద్యుత్ ప్రమాదాల కు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్ శాఖ ఒంగోలు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మాకినేని హరిబాబు సూచించారు. విద్యుత్ తీగలు సాగి తెగిపడే ప్రమాదం ఉన్నదని ఎక్కడైనా తీగలు తెగిపడినట్లు గమనించినట్లయితే సంబంధిత విద్యుత్ శాఖ లైన్మెన్ లేదా ఏఈ లకు తెలియజేయాలని సూచించారు. తెగిపడిన తీగలను తాకకుండా వెంటనే విద్యుత్ సిబ్బంది కి తెలియజేసి సహకరించాలని ఆయన కోరారు. అధిక ఉష్ణోగ్రతల వలన డిటీఆర్ ఎస్ పేలే ప్రమాదం ఉంది కావున మధ్యాహ్న సమయాలలో డిటిఆర్ఎస్ దగ్గరగా ఉండవద్దని కోరారు. అధిక ఉష్ణోగ్రత వలన విద్యుత్ పరికరాల సామర్థ్యం కూడా తగ్గటం వలన విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగిపోయిందని విద్యుత్ అంతరాయం ఏర్పడే ప్రమాదం ఉన్నందున విద్యుత్ సరఫరా పునరుద్ధరించిన వెంటనే ఇంట్లో ఉన్న అన్ని విద్యుత్ పరికరాలు ఒకేసారి ఆన్ చేయకుండా ఒకదాని తర్వాత ఒకటి ఆన్ చేసుకోవాల్సిందిగా కోరారు. విద్యుత్ పరికరాలకు అమర్చిన ఎర్తింగ్ సరిగా పనిచేయకపోవడం వలన పరికరాలు పాడయ్యే ప్రమాదం ఉందని ప్రతి వినియోగదారుడు వారి ఇంటి వద్ద ఉన్న ఎర్త్ బిట్స్ లో నీటితో నింపవలసిందిగా కోరారు. రైతులు మోటార్ లను ఆన్ చేయడానికి వెళ్ళినప్పుడు స్టార్టర్స్ బాక్స్ ను తాకకుండా చేతికి గ్లోవ్స్ వాడి మాత్రమే మోటార్లు ఆన్.. ఆఫ్ చేయవలసిందిగా హరిబాబు కోరారు. అకస్మాత్తుగా వచ్చిన అధిక వినియోగం వలన డిటిఆర్లు ట్రిప్ అయ్యి విద్యుత్ అంతరాయం కలిగే అవకాశం ఉన్నదని అటువంటి సందర్భాలలో సత్వరం స్పందించడం కొరకు విద్యుత్ సిబ్బంది ఆయా గ్రామాలలో తప్పనిసరిగా ఉండాలని విద్యుత్ వినియోగదారులకు సత్వర సర్వీస్ అందించాలని, డివిజన్ లో ఉన్న క్షేత్రస్థాయి సిబ్బందిని కోరారు. ఏసీలు ఆన్ చేసినప్పుడు రూమ్ టెంపరేచర్ 26 డిగ్రీలు సెల్సియస్ ఉండేట్టుగా చూసుకొని తద్వారా వినియోగం తగ్గించి సంస్థకు ప్రజలకు సహకరించాలని కోరారు. నెలకు 200 యూనిట్లకి ఎక్కువగా వాడే వినియోగదారులు తప్పనిసరిగా సోలార్ ప్యానల్స్ బిగించుకొని విద్యుత్ బిల్లులను తగ్గించుకోవాల్సిందిగా సూచించారు. ఒంగోలు డివిజన్ పరిధిలో ఎలాంటి విద్యుత్ సమస్య ఎదురైనా టోల్ ఫ్రీ నెంబర్ 9440817495 లేదా సంబంధిత విద్యుత్ శాఖ ఏఈ లకు,లైన్ మెన్ లకు ఫోన్ ద్వారా సమాచారం అందించాలని ఈఈ కోరారు.

## బక్రీద్ పండుగ సోదరభావానికి ప్రతీక

### ముస్లిం సోదరులకు షేక్ బడే నాయిబ్ రసూల్ శుభాకాంక్షలు



సి ఎస్ పురం, పెన్ పవర్ మే 27

మండలంలోని ముస్లిం సోదరులు, సోదరీమణులకు టిడిపి సీనియర్ నాయకులు షేక్ బడే నాయిబ్ రసూల్ (చంద్రపూర్, మహారాష్ట్ర )బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బక్రీద్ పండుగ త్యాగానికి, భక్తికి, మానవతా విలువలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ పరస్పర ప్రేమాభిమానాలతో, సోదరభావంతో జీవించాలని ఆకాంక్షించారు.సమాజంలో శాంతి, సామరస్యాలు నెలకొనాలని, పండుగలు ప్రజల మధ్య ఐక్యతను పెంపొందించే వేదికలుగా మారాలని అన్నారు. పేదలకు సహాయం చేయడం, అవసరమైన వారికి తోడ్పాటు అందించడం బక్రీద్ పండుగ ప్రధాన సందేశమని తెలిపారు. ఈ పవిత్ర పర్వదినాన్ని ప్రతి కుటుంబం ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ మరోసారి ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు.

## వివాహ దినోత్సవం సందర్భంగా శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన గంగసాని లక్ష్మి హుస్సేన్ రెడ్డి దంపతులు



పామూరు, పెన్ పవర్,మే27

పామూరు మండల వైసీపీ కన్వీనర్ గంగసాని హుస్సేన్ రెడ్డి, పామూరు ఎంపీపీ గంగసాని లక్ష్మీ హుస్సేన్ రెడ్డి లు తమ వివాహ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని శ్రీ వల్లి సమేత భుజంగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వహకులు గంగసాని లక్ష్మీ హుస్సేన్ రెడ్డి దంపతుల చే స్వామివార్లకు ప్రత్యేక పూజలు జరిపించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా కనిగిరి నియోజకవర్గంలోని పలు మండలాల నుంచి పలువురు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, గంగసాని కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు గంగసాని లక్ష్మీ హుస్సేన్ రెడ్డి దంపతులకు వివాహ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరమేశ్వరుని కరుణాకటాక్షాలతో ప్రజలంతా సుఖసంతోషాలతో జీవనం సాగించాలని, ముఖ్యంగా తమకు వివాహ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన వారందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నట్లు వారన్నారు

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com